ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

గురువారం | 15-10- 2026 | సంపుటి: 17, సంచిక: 194, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ



ఎల్‌నినో ప్రభావంపై సీఎం రేవంత్‌రెడ్డి

సమీక్ష

కరెంటు కోతలపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు సీఎం తీవ్ర హెచ్చరిక

కోతలకు రోజుకో కారణం చెప్పొద్దు

వచ్చే 20 రోజులు పంటలకు కీలకం

ఎట్టి పరిస్థితుల్లోనూ కరెంటు ఆపొద్దు

హైదరాబాద్, అక్టోబరు 14 (ప్రజాకలం) :

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న విద్యుత్ అంతరాయాలపై ఆ శాఖ ఉన్నతాధికారుల మీద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా సాఫీగా జరిగేలా చూడాలని తాను పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. 'ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సింది నేను. రైతుల పంటలను కాపాడేందుకు తగిన విధంగా విద్యుత్ సరఫరా చేయాలని ఎన్నిసార్లు చెప్పినా పరిస్థితి మారటం లేదు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను సహించేది లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎవరినీ ఉపేక్షించను. అవసరమైతే విద్యుత్ శాఖ స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీ.. సంబంధిత విభాగపు ఐఏఎస్ లను, ఉన్నతాధికారులను సస్పెండ్ చేస్తా' అంటూ సీఎం తీవ్రస్థాయిలో హెచ్చరించినట్లు సమాచారం. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి సరఫరాపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలవారీగా ప్రస్తుత పరిస్థితులను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా విద్యుత్ అంతరాయాలపై సీఎం స్పందిస్తూ.. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు లింకేజీ ఏర్పాట్లు చేసినా యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌లో పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి ఎందుకు జరగడం లేదన్నారు. ఈ క్రమంలోనే, తాను ఇప్పటికే పలుమార్లు ఆదేశాలు జారీ చేసినా పరిస్థితులు మారకపోవటంపై అధికారుల మీద విరుచుకుపడ్డారు. విద్యుత్ అంతరాయాలకు రోజుకో కారణం చెప్పవద్దని హెచ్చరించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు విద్యుత్ సరఫరా చేయాలని, పంటలు చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వచ్చే 20 రోజులు పంటలకు అత్యంత కీలకమని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ కొరత కారణంగా రైతులు పంట నష్టపోకూడదని తెలిపారు. వ్యవసాయానికి విద్యుత్ అవసరం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అందుకు అనుగుణంగా సరఫరా పెంచాలన్నారు. ఎల్‌నినో కూడా కరోనా లాంటి విపత్తేనని, ఈ పరిస్థితి ఎప్పటివరకు ఉంటుందో ఎవరికీ తెలియదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అప్రమత్తం కాకపోతే సంక్షోభం తలెత్తుతుందని హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో ఎల్‌నినో ప్రభావాన్ని లోతుగా అంచనా వేసి, సమస్యలను అధిగమించేందుకు పరిష్కార మార్గాలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.

తరువాయి 2వ పేజీలో...

బడా బాబులకు సింగరేణిని

కట్టబెట్టే కుట్ర

సింగరేణిపై కుట్రలను ప్రాణాలర్పించైనా అడ్డుకుంటాం



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు
- స్వరాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికుల పాత్ర మరువలేనిది
- సింగరేణి కార్మిక గర్జన సభలో రేవంత్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డ కేటీఆర్

పెద్దపల్లి,అక్టోబర్14:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

137 ఏళ్ల మహోజ్వల చరిత్ర కలిగిన సింగరేణి బొగ్గు గని సంస్థను బడా బాబులకు,కాంట్రాక్టర్లకు కట్టబెట్టేం దుకు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర కుట్రలు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ఎంతటి త్యాగానికైనా సిద్ధపడి, చివరికి ప్రాణాలు అడ్డమేసైనా సరే కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు.

తరువాయి 2వ పేజీలో...



అధికార పక్షమైనా.. ప్రతిపక్షమైనా

అభివృద్ధిలో వివక్ష లేదు

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయాలకు తావులేదు..

అర్హులే ప్రామాణికం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 14 (ప్రజాకలం) గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆ కుటుంబం ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాలకే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పరిమితమైతే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పార్టీల తేడా లేకుండా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని

తరువాయి 2వ పేజీలో...

తెలంగాణలో పుట్టడమే అదృష్టంగా భావించేలా

సంక్షేమ పథకాలు

- పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమానికి పెద్దపీట

- మన్ననూరులో రూ.53.78 కోట్లతో 220/30 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

నాగర్‌కర్నూల్ అక్టోబర్ 14 (ప్రజాకలం) : తెలంగాణలో పుట్టడమే అదృష్టంగా భావించేలా ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పుట్టినప్పటి నుంచి వృద్ధాప్యం వరకు ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూరు గ్రామంలో రూ. 53.78 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 220/30 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత మూడేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ. 1,64,431 కోట్లను ప్రజల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఆర్థిక సాయం



అందిస్తున్నామని, రాష్ట్రంలో ఇప్పటివరకు సుమారు 76 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు.

విద్యుత్ రంగ అభివృద్ధికి ప్రాధాన్యం

అచ్చంపేట ప్రాంతంతో తనకు 1980 నుంచి 46 ఏళ్ల అనుబంధం ఉందని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ఈ ప్రాంతంలో విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి

తరువాయి 2వ పేజీలో...

బతికున్నోడికి 'మరణ' శాసనం

మంథని గిర్దావర్ అనిల్ కుమార్ సీసీఎల్ఏకు సరెండర్..!

తప్పుడు విరాసత్ నివేదికపై అదనపు కలెక్టర్ విచారణ పూర్తి

జిల్లాకు సేవలు అవసరం లేదని తేల్చిన యంత్రాంగం : అధికారిక వర్గాల సమాచారం

పెద్దపల్లి,అక్టోబర్ 14 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి):

రెవెన్యూ శాఖలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అవకతవకలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవన్న సంకేతాలను జిల్లా యంత్రాంగం పంపుతోంది. బతికున్న వ్యక్తిని రికార్డుల్లో మరణించినట్లుగా చూపి,తప్పుడు విరాసత్ చేసిన వ్యవహారంలో మంథని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్‌ను చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు అధికారిక వర్గాల సమాచారం ద్వారా తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు...ఈ వ్యవహారంపై గతంలోనే సస్పెన్షన్‌కు గురైన సదరు గిర్దావర్‌పై జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అదనపు కలెక్టర్ పూర్తి స్థాయి విచారణ నిర్వహించారు. విచారణ నివేదికలో నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు నివేదిక ఇచ్చినట్లు గుర్తించినట్లు తెలిసింది. అలాగే విధి నిర్వహణలో అలసత్వం,సమీక్షలు,అంతర్గత విచారణల సందర్భాల్లో క్రమశిక్షణారాహిత్యంగా వ్యవహరించడం వంటి అంశాలను సైతం నివేదికలో ఉన్నతాధికారులు నమోదు



చేసినట్లు సమాచారం. ఈ విచారణ నివేదికను పరిశీలించిన జిల్లా కలెక్టర్,సదరు ఉద్యోగి సేవలు జిల్లాకు అవసరం లేదని నిర్ణయిస్తూ,ఆయనను సీసీఎల్ఏకు సరెండర్ చేస్తూ ఉన్నతాధికారులకు నివేదించినట్లు అధికార వర్గాల ద్వారా సమాచారం అందింది. జిల్లా యంత్రాంగం తీసుకున్న ఈ నిర్ణయం ప్రస్తుతం స్థానిక రెవెన్యూ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పేదలు, బలహీన వర్గాల కోసం పోరాడిన

మహనీయుడు పండుగ సాయన్న

మంత్రి వాకిటి శ్రీహరి - నవాబుపేటలో పండుగ సాయన్న కాంస్య విగ్రహం ఆవిష్కరణ

అక్టోబర్ 22న హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రభుత్వ పరంగా పండుగ సాయన్న జయంతి ఉత్సవాల నిర్వహణ



మహబూబ్‌నగర్, ప్రజాకలం ప్రతినిధి, అక్టోబర్ 14:

పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన పండుగ సాయన్న ఆశయాలను భావితరాలకు అందించాలని రాష్ట్ర క్రీడలు, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. పండుగ సాయన్న ఒక కులానికే పరిమితమైన నాయకుడు కాదని, సమాజంలోని అన్యాయాలు, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన ప్రజానాయకుడని పేర్కొన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండల కేంద్రంలో పండుగ సాయన్న కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.

తరువాయి 2వ పేజీలో...

ఇద్దరు వలస కూలీల మృతి..

కాంగ్రెస్ సర్కార్ మౌనం ఎందుకు?



బాధిత కుటుంబాలకు న్యాయం ఎప్పుడు?

అధికారులారా.. స్పందించండి!

మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు పరామర్శ

గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 14 (ప్రజా కలం):

జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం ఇందువాసి గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు వలస కూలీలు ఎం. నాగన్న, ఏసేపు కుటుంబాలను మాజీ మంత్రులు తన్నీరు హరీశ్ రావు, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పరామర్శించారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని యాదగిరి జిల్లాకు కూలి పనుల నిమిత్తం వెళ్లిన సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వలస కూలీలు ప్రాణాలు కోల్పోవడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. గద్వాల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో మాజీ మంత్రులు బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వలస కూలీల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరినట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి!

వలస కూలీల రోడ్డు ప్రమాద ఘటనపై జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంపై బీఆర్ఎస్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తగిన పరిహారం అందించి, క్షతగాత్రులకు అవసరమైన వైద్య సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

తరువాయి 2వ పేజీలో...

ఎల్‌నినో ప్రభావంపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

మొదటి పేజీ తరువాయి...

మళ్లీ వానలు వడే వరకూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టాల్సిందేనని స్పష్టం చేశారు. వచ్చే జూన్ వరకు అవసరమైన యాక్షన్‌ప్లాన్‌ను ప్రతి శాఖ రూపొందించాలని ఆదేశించారు. రాబోయే సంక్షోభాన్ని ముందుగానే అంచనా వేసి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు.

తాగునీటికి, పశుగ్రాసానికి ఇబ్బందులు తలెత్తవద్దు

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి సరఫరా సజావుగా సాగేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్మాణ రంగంతో పాటు ఇతర అవసరాలకు.. మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో (ఎస్టీపీలు) శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో పశువులు ఇబ్బంది పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పశు గ్రాసం కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.ఎల్‌నినో ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ప్రతి మండలానికి గ్రూప్-1, గ్రూప్-2 స్థాయి అధికారులను నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆయా మండలాల్లో వర్షాభావ పరిస్థితులు, విద్యుత్, తాగునీటి సరఫరా, పంటలు, పశు గ్రాసం వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించే బాధ్యతలను వారికి అప్పగించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదించేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

గ్రామసభలు, కళాజాతలతో ప్రజల్లో అవగాహన

కళాజాతల ద్వారా ప్రజలకు ఎల్‌నినో ప్రభావాన్ని వివరించాలని, నీరు, విద్యుత్ పొదుపుతో పాటు రాబోయే పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అన్ని వర్గాల ప్రజలకు ఈ విపత్తు తీవ్రతను వివరించాలని, దసరా నుంచి దీపావళి వరకు రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సీఎం ఆదేశించారు.

తెలంగాణలో పుట్టడమే అదృష్టంగా భావించేలా సంక్షేమ పథకాలు

మొదటి పేజీ తరువాయి...

ఇప్పటికే రూ.75 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో 1,219 కొత్త డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతో పాటు 403 కిలోమీటర్ల మేర కొత్త విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రైతులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు 5 వేల కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. రైతులు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యుత్ రంగంలో మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

రహదారులు, పర్యాటక అభివృద్ధికి చర్యలు

రాష్ట్రవ్యాప్తంగా రహదారుల నిర్మాణం, అభివృద్ధి కోసం రూ.90 వేల కోట్లు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అచ్చంపేట ప్రాంతాన్ని ప్రధాన రవాణా కూడలిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. నల్లమల ప్రాంతంలో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు విద్యుత్, రహదారులు, పర్యాటకం వంటి రంగాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని భట్టి విక్రమార్క తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

బడా బాబులకు సింగరేణిని కట్టబెట్టే కుట్ర



మొదటి పేజీ తరువాయి...

బుధవారం రామగుండంలో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ సింగరేణి కార్మిక గర్జన భారీ బహిరంగ సభకు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. పోరాటాలకు,రణగర్జనలకు రామగుండం గడ్డ పురిటిగడ్డ లాంటిదని కేటీఆర్ కొనియాడారు.చీకటి గుహల్లో రక్తాన్ని తర్పణంచేసి,నల్లబొగ్గుకు నెత్తురు అద్ది,ప్రాణాలను పైతం పణంగా పెట్టి కష్టపడుతున్న కార్మికుల త్యాగాలు మరువలేనివని అన్నారు.తమ చెమట, నెత్తురు ధారపోసి నల్లబంగారాన్ని వెలికితీస్తూ,దేశానికి విద్యుత్‌ను అందించి వెలుగులు ప్రసరింపజేస్తున్న ప్రతి కార్మిక సోదరుడికి,వేలాది కార్మిక కుటుంబాలకు శిరస్సు వంచి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. చావుతో సహవాసం చేస్తూ,ప్రాణాలకు తెగించి పనిచేసే ఇటువంటి సాహసోపేతమైన కార్మికులు ప్రపంచంలో ఒక్క సింగరేణిలోనే ఉంటారని గర్వంగా చాటిచెప్పారు.కార్మికులకు కేవలం బొగ్గు ఉత్పత్తి చేయడమే కాకుండా,ఉద్యమాలను నిర్మించడం కూడా బ్రహ్మాండంగా తెలుసని కేటీఆర్ గుర్తుచేశారు. ఉత్పత్తిలోనే కాకుండా స్వరాష్ట్ర ఉద్యమాల్లోనూ సింగరేణి కార్మికులు మొనగాళ్లలా నిలిచారని ప్రశంసించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చిన సమయంలో సకలజనుల సమ్మెలో భాగంగా 42 రోజుల పాటు ఒక్క బొగ్గు పెళ్ల కూడా తీయకుండా సమ్మె చేసి,మొత్తం దక్షిణాది రాష్ట్రాలనే చిమ్మచీకట్లోకి నెట్టి ఆనాటి పాలకులను గడగడలాడించిన ఘనత సింగరేణి కార్మిక లోకానిదేనని స్పష్టం చేశారు. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టినప్పుడు,ఆయన వెంటే నిలిచి 7 రోజుల పాటు కేసీఆర్‌తో కలిసి కార్మికులు కదం తొక్కారని తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా కార్మిక సంఘాలు జీతాల కోసం,బోనస్ కోసం,తమ హక్కుల కోసం పోరాటాలు చేస్తే,ఏకైక మినహాయింపుగా కేవలం తమ మాతృభూమి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వీరోచితంగా ఉద్యమించిన ఏకైక కార్మిక గడ్డ గోదావరిఖని,సింగరేణి అని ఆయన గర్వంగా వెల్లడించారు. సింగరేణి సంస్థ సమగ్ర అభివృద్ధి,కార్మికుల సంక్షేమం కేవలం బీఆర్ఎస్ పాలనలోనే సాధ్యమయ్యాయని కేటీఆర్ స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సింగరేణిని క్రమక్రమంగా నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తోందని,బొగ్గు ఉత్పత్తి గణనీయంగా పడిపోవడమే కాకుండా కార్మికులకు చెందాల్సిన లాభాల వాటాలు,ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తి భారీగా పడిపోవడానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించారు.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 2023-24 నాటికి సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి రికార్డు స్థాయిలో 70 మిలియన్ టన్నులకు చేరిందని గుర్తుచేశారు.కానీ,ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో అది కాస్తా 58 మిలియన్ టన్నులకు పడిపోయిందని మండిపడ్డారు.సింగరేణి కార్మికుల కష్టంలో ఎటువంటి మార్పు లేకపోయినా,అధికారుల నిర్లక్ష్యం,అవినీతి మరియు ఓపెన్ కాస్ట్ ఓబీ టెండర్లలో జరుగుతున్న జాప్యం వల్లే ఉత్పత్తి గణనీయంగా తగ్గిందని కేటీఆర్ స్పష్టం చేశారు.సిరుల సింగరేణిని కుంభకోణాల కనిగా మారుస్తున్నారని,ఉత్పత్తి క్షీణతకు ఎట్టి పరిస్థితుల్లోనూ కార్మికులు కారణం కాదని ఆయన స్పష్టం చేశారు.రాబోయే దసరా పండుగ కానుకగా సింగరేణి లాభాల్లో కార్మికులకు దక్కాల్సిన వాటాను తక్షణమే ప్రకటించాలని,కాలయాపన చేయకుండా నిలిచిపోయిన మెడికల్ బోర్డులను పునరుద్ధరించి డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సింగరేణి కార్మిక సంఘాల ఎన్నికలను వెంటనే నిర్వహించి కార్మికుల ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని ఒత్తిడి తెచ్చారు.కార్మికుల కోలాహలంతో మార్మోగిన ఈ భారీ బహిరంగ సభలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్,మాజీ శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి,మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్,కోరుకంటి చందర్,గంద్ర వెంకటరమణారెడ్డి,పుట్ట మధుకర్, దుర్గం చిన్నయ్య, సుంక రవి శంకర్,ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి,కోవా లక్ష్మి,బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు కౌశిక హరి,మూల విజయ రెడ్డి,కోలేటి దామోదర్‌లతో పాటు వలువురు ప్రజాప్రతినిధులు,వివిధ స్థాయిల నాయకులు,పార్టీ కార్యకర్తలు,సింగరేణి కార్మికులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

కాంగ్రెస్ సర్కార్ మౌనం ఎందుకు?

మొదటి పేజీ తరువాయి...

ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు కరెంటు కష్టాలా?.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హరీశ్ రావు!

జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలో ఎండిపోయిన పంట పొలాలను మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గట్టు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించి లాగ్‌బుక్‌ను పరిశీలించారు. లో వోల్టేజీ, విద్యుత్ సరఫరా సమస్యలపై విద్యుత్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రైతుల పక్షాన నిలిచిన నాయకుడు కేసీఆర్!

ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారని పేర్కొన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తూ రైతులకు అండగా నిలిచామని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో రైతుల సంక్షేమానికి కృషి చేశామని అన్నారు.

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని హరీశ్ రావు విమర్శించారు. గట్టు మండలంలో లో వోల్టేజీ సమస్యతో పంటలు ఎండిపోతున్నాయని, రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే స్పందించి వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని, ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రాబోయే రోజుల్లో రైతులు తగిన రీతిలో స్పందిస్తారని హరీశ్ రావు అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వీరి వెంట ఎమ్మెల్యే విజయుడు, మాజీమంత్రి నిరంజన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ గద్వాల ఇన్చార్జి బాసు హనుమంతు నాయుడు, కురువ విజయ్ కుమార్, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

పేదలు, బలహీన వర్గాల కోసం పోరాడిన

మహనీయుడు పండుగ సాయన్న

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నిజాం పాలనలో ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడానికి భయపడే పరిస్థితుల్లోనూ పండుగ సాయన్న ధైర్యంగా దోపిడీ దొరలను, దేశ్‌ముక్కులను ఎదిరించి వారు దోచుకున్న సంపదను పేదలకు పంచి అండగా నిలిచారని అన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, సర్దార్ పాపన్న, కొమురం భీమ్ వంటి పోరాట యోధులు కూడా సామాజిక అన్యాయాలు, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. మహనీయులను కులాలకు పరిమితం చేయకుండా, వారి ఆశయాలను సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పాలమూరు గడ్డపై నవాబుపేట మండలం మెరుగోనిపల్లె లో జన్మించిన పండుగ సాయన్న తెలంగాణ ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన సేవలు, త్యాగాలను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో నవాబుపేటలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణలో పండుగ సాయన్న తొలి కాంస్య విగ్రహాన్ని ఇక్కడ ఆవిష్కరించడం ఆనందంగా ఉందని తెలిపారు. రాబోయే రోజుల్లో జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లోనూ విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తామని ప్రకటించారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వ అధికారిక కార్యక్రమంగా నిర్వహించేందుకు తాను ప్రతిపాదనలు పంపగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరు రోజుల్లోనే ఆమోదం తెలిపారని మంత్రి వెల్లడించారు. ఈ నెల 22న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో పండుగ సాయన్న జయంతి వేడుకలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత ఆయన స్ఫూర్తితో సమాజంలోని అన్యాయాన్ని ధైర్యంగా ఎదిరిస్తూ పేదలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. విగ్రహాలను ఏర్పాటు చేయడంతోపాటు మహనీయుల ఆలోచనలు, త్యాగాలను ఆచరణలో పెట్టినప్పుడే వాటికి నిజమైన సార్థకత చేకూరుతుందని అన్నారు.

ముదిరాజ్ సామాజిక వర్గ అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని మంత్రి పేర్కొన్నారు. విద్య ద్వారా ఆర్థికంగా, సామాజికంగా ఎదిగి సమాజంలో తగిన గుర్తింపు సాధించాలని సూచించారు. కులాభిమానం ఇతర వర్గాల పట్ల వివక్షకు దారితీయకూడదని, అన్ని కులాల ప్రజలు పరస్పర సహకారంతో సమాజాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-బీ నుంచి బీసీ-ఏలో చేర్చే అంశంపై తన వంతు కృషి చేస్తానని మంత్రి తెలిపారు. ఇప్పటికే బీసీ-ఏలో ఉన్న మత్స్యకార వర్గాలకు నష్టం కలగకుండా, ముదిరాజ్‌లకు సముచిత రిజర్వేషన్ ప్రయోజనాలు లభించేలా ప్రయత్నిస్తానని చెప్పారు. ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి మరింత మంది ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, ఎమ్మెల్యేలుగా ఎదిగేందుకు సహకరిస్తానన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సహా అన్ని బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి పండుగ సాయన్న స్ఫూర్తితో పనిచేస్తానని పేర్కొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, నవాబుపేటలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో జడ్చర్ల, మిడ్జిల్, బాలానగర్ మండలాల్లోనూ పండుగ సాయన్న విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ముందుగా, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా నవాబు పేట మండలానికి చేరుకున్న క్రీడలు, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, మండలి చైర్మన్ బండ ప్రకాష్ లకు, మొక్కను అందజేసి, పోలీస్ గౌరవ వందనంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్, ఎమ్మెల్సీ బండ ప్రకాశ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్, మహబూబ్‌నగర్ నగర మేయర్ జి. మమత, నవాబుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహులు, జిల్లా డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్, మాజీ ఎం.పి శ్రీనివాస్ రెడ్డి, నవాబుపేట మండల ప్రజాప్రతినిధులు, ముదిరాజ్, మత్స్యకార సంఘాల నాయకులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికార పక్షమైనా.. ప్రతిపక్షమైనా అభివృద్ధిలో వివక్ష లేదు

మొదటి పేజీ తరువాయి...

సమానంగా చూస్తోందని అధికార పార్టీ ఎమ్మెల్యే ఉన్నా.. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే ఉన్నా.. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించడంలో ఎలాంటి వివక్షకు తావులేదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం నాడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి రాష్ట్ర పరిశ్రమలు ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో

హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్ల రూపాయలు ఉన్నప్పటికీ, పేదలు నివసించే ప్రాంతాల్లోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. నగరంలో జీవనోపాధి పొందుతున్న పేదలను దూర ప్రాంతాలకు తరలించి వారి ఉపాధికి ఇబ్బందులు కలిగించే విధానానికి స్వస్తి పలుకుతున్నామని తెలిపారు.

క్యూర్ పరిధిలో మొదటి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, 23 నియోజకవర్గాల్లో పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశామని వెల్లడించారు. ఇప్పటికే ఆరు చోట్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశామని వివరించారు. మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్ధిదారులను పారదర్శకమైన బహిరంగ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఇప్పటికే సొంత ఇల్లు ఉన్నవారిని గుర్తించి, అర్హతలను ధ్రువీకరించిన అనంతరం పారదర్శకంగా డ్రా నిర్వహించామని చెప్పారు. ఎంపికైన వారిలో స్థానికంగా నివసించే అర్హులనే నిర్ధారించి ఇళ్లు కేటాయిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని వెల్లడించారు. త్వరలో రెండవ విడత ఇందిరమ్మ టవర్స్ కోసం మరో సారి దరఖాస్తులు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ టవర్స్‌లో ఎంపికైన లబ్ధిదారులకు కేవలం కేటాయింపు పత్రాలు ఇచ్చి సరిపెట్టబోమని, ఎలాంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా పూర్తి హక్కులతో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసి అందిస్తామని మంత్రి ప్రకటించారు. ప్రతి అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన భూమిలో వాటాను కూడా రిజిస్ట్రేషన్‌లో పొందుపరుస్తామని తెలిపారు.

వచ్చే బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత లబ్ధిదారులకు ఇళ్లను పూర్తి చేసి, వారి చేతుల మీదుగా తాళాలు అందించాలన్నదే తమ లక్ష్యమని మంత్రి వెల్లడించారు. తొలి విడతలో అవకాశం దక్కని అర్హులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, తదుపరి విడతల్లో కొత్త దరఖాస్తుదారులతో సహా అర్హులందరినీ పరిశీలిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడంతో పాటు, ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని చెప్పారు. ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి, సమీప ప్రాంతాల్లోని అర్హులైన పేదలకు నిబంధనల ప్రకారం కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ఉన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కోసం సుమారు 440 కోట్ల రూపాయిలు ఖర్చు చేశామని మంత్రి గారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ ఎండీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మనూచౌదరి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో లబ్ధిదారులు స్నేహ, శివకుమారి, రెహ్మాతి తదితరులు మాట్లాడి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని, ప్రభుత్వ పనితీరును ప్రశంసించారు. అనంతరం ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపు జరిగింది.

యాసంగిలో వరి సాగు విస్తీర్ణం

తగ్గే అవకాశం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, అక్టోబర్ 14: రానున్న యాసంగిలో వరి సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ నేపథ్యంలో పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంట వ్యర్థాలను కాల్చకుండా పశుగ్రాసంగా వినియోగించేలా చూడాలని సూచించారు. అవసరమైతే ఖరీఫ్ పశుగ్రాసాన్ని కొనుగోలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. పశుగ్రాసం అందుబాటులో ఉండేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ వ్యవసాయంలో ఏఐ, శాటిలైట్ టెక్నాలజీకి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. జర్మనీ ప్రతినిధులతో డిజిటల్ వ్యవసాయ సాంకేతికతపై చర్చలు జరిపినట్లు వివరించారు. శాటిలైట్ డేటాతో నేలలోని పోషకాల లభ్యత అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకేసారి 70 లక్షల మంది రైతులకు మట్టి పోషకాలపై సమాచారం అందించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిపారు.ప్రతి 12 రోజులకు ఎరువుల వినియోగంపై సమగ్ర సమాచారం అందించే అవకాశం ఉందని అన్నారు. అధిక ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలని ఈ సందర్భంగా రైతులకు సూచించారు. సమతుల్య ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కొత్త సాంకేతికత కచ్చితత్వం, విశ్వసనీయతను శాస్త్రీయంగా పరిశీలించాల్సి ఉందని చెప్పారు. ఈ సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. నేల ఆరోగ్య పరిరక్షణ, సాగు ఖర్చుల తగ్గింపునకు డిజిటల్ వ్యవసాయం ఉపయోగకరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమీక్షలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, యాంత్రీకరణ, గోదాముల నిర్మాణాలపై సుదీర్ఘంగా చర్చించారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై

దృష్టి సారించాలి



- రైతులకు శాస్త్రీయ సూచనలు అందించాలి
- పంటలు ఎండిపోకుండా విద్యుత్ సరఫరా చేయాలి
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 14 (ప్రజాకలం) :

ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేపట్టాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. సంప్రదాయ పంటలతో పాటు వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ శాఖ, శాస్త్రవేత్తలు రైతులకు శాస్త్రీయ సూచనలు, సలహాలు అందించాలని, పంటలు ఎండిపోకుండా అవసరమైన విద్యుత్ సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. జగిత్యాల జిల్లాలోని పోలాస ప్రాంతీయ పరిశోధనా స్థానం ఆవరణలో వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళా–2026 కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు.

ప్రత్యామ్నాయ పంటలతో మెరుగైన ఫలితాలు...

వాతావరణ మార్పుల వల్ల వ్యవసాయ రంగంలో ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసుకొని రైతులు సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. నీటి లభ్యత, నేల స్వభావం, పెట్టుబడి వ్యయం, మార్కెట్‌లో పంటలకు ఉన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని తెలిపారు. రైతులకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ నూతన సాగు పద్ధతులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఉత్తమ రైతులకు సన్మానం...

కిసాన్ మేళాలో భాగంగా వ్యవసాయ రంగంలో చేపడుతున్న పరిశోధనలు, నూతన సాగు పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన స్టాళ్లను మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు పరిశీలించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి వినియోగం, పంటల సంరక్షణపై అవగాహన కల్పించారు. రైతులు తమ సందేహాలను నివృత్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతులు, ఉత్తమ వ్యవసాయ అధికారులను సన్మానించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న యంత్ర పరికరాల స్టాళ్లు...

జగిత్యాలలో నిర్వహించిన కిసాన్ మేళాలో వివిధ కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాళ్లు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మేళాను సందర్శించిన రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో పాటు పలువురు అధికారులు వివిధ స్టాళ్లను సందర్శించారు. వ్యవసాయ యంత్ర పరికరాల పనితీరు, వాటి ఉపయోగాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అధిక పాల దిగుబడి ద్వారా పాడి రైతులు ఆర్థిక స్వావలంబన సాధించే మార్గాలపై మంత్రి పాడి గేదెల పెంపకం, పాల ఉత్పత్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పాడి పరిశ్రమపై అవగాహన కల్పించడంలో కిసాన్ మేళా ఉపయోగకరంగా నిలిచింది.



నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి
- జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్



వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడంతో పాటు నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ సూచించారు. గ్రామస్థాయిలో రైతులకు పంటల ఎంపిక, విత్తనాలు, ఎరువుల యాజమాన్యం, చీడపీడల నివారణపై అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సాగు సమయంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా, పంటలు ఎండిపోకుండా అవసరమైన విద్యుత్ సరఫరా అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయానికి అవసరమైన సేవలు సకాలంలో అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

ఆధునిక సాగు పద్ధతులను అందిపుచ్చుకోవాలి..
- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయంలో వస్తున్న ఆధునిక మార్పులను రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఒకే పంటపై ఆధారపడకుండా శాస్త్రవేత్తల సూచనల మేరకు ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని తెలిపారు. పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుంటూ అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని అన్నారు. పంటల ఎంపిక నుంచి విత్తనాలు, ఎరువుల వినియోగం, చీడపీడల నివారణ, పంట కోత వరకు ప్రతి దశలో శాస్త్రీయ పద్ధతులను పాటించాలని సూచించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రత్యామ్నాయ పంటలపై రైతుల ఆరా...

జగిత్యాల: కిసాన్ మేళాలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటల సాగుపై పలువురు రైతులు, రైతు నాయకులు శాస్త్రవేత్తలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. తక్కువ వర్షపాతం సమోదైన పరిస్థితుల్లో ఏయే పంటలు సాగు చేయాలి, వాటి ద్వారా మెరుగైన దిగుబడులు ఎలా సాధించాలి అనే అంశాలపై శాస్త్రవేత్తలతో చర్చించారు.వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడం, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు పొందారు.









అదనపు కలెక్టర్ గా బాధ్యతలు
స్వీకరించిన ఎన్. ప్రసూనాంబ

జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 14 (ప్రజాకలం): జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా ఎన్. ప్రసూనాంబ బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమెను అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా నియమించారు. గతంలో ఆమె తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీ ఈ ఓ) కార్యాలయంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించారు. అక్కడి నుంచి బదిలీ పై జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమితులై నేడు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి కే.వై. ప్రసాద్ కలెక్టరేట్ ఏవో కిషన్, కలెక్టరేట్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టర్ ను కలిసిన జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. ప్రసూనాంబ

జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 14 (ప్రజాకలం): జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా ఎన్. ప్రసూనాంబ బుధవారం బాధ్యతలు స్వీకరించగా మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ను కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బాధ్యతలను సమర్థవంతంగా ప్రజలతో మమేకమై నిర్వర్తించాలని జిల్లా కు రాష్ట్ర స్థాయి లో గుర్తింపు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. అనంతరం జిల్లా పరిపాలన అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు.



సీజనల్ వ్యాధులపై అవగాహన

దీర్ఘకాలిక వ్యాధుల గుర్తింపునకు ప్రత్యేక పరీక్షలు - కొనరావుపేటలో ఉచిత వైద్య శిబిరం



మెట్ పల్లి రూరల్,అక్టోబర్ 14:(ప్రజా కలం);మెట్ పల్లి మండలంలోని కొనరావుపేట గ్రామంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఎల్లాల అంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధుల గుర్తింపునకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంజిత్ రెడ్డి మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల నేపథ్యంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడడం, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడం, సురక్షితమైన తాగునీటిని వినియోగించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. జ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. శిబిరంలో అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించడంతో పాటు మందులు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయడం, వ్యాధులను ముందుగానే గుర్తించడం, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఆరోగ్య శాఖ సిబ్బందికి సహకరిస్తూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారు గంగారెడ్డి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి రాణప్రతాప్ పరంధాములు, ఆరోగ్య శాఖ సిబ్బంది సీహెచ్ఓ వెంకటలక్ష్మి, హెచ్ఈఓ రమేశ్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 14 (ప్రజాకలం):– విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని మెట్‌పల్లి పట్టణంలోని 14వ వార్డు కౌన్సిలర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ధోనికేల నవీన్, ఆయన సతీమణి శిరీష దంపతులు తమ వార్డులో పని చేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల కృషి ఎంతో గొప్పదని అన్నారు. కార్మికుల సేవలను గుర్తించి, వారిని గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డులో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు గంగారం, లక్ష్మి, నిజాముద్దీన్, రమేశ్ తదితరులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు.

రాష్ట్రం లో రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వం

బెల్లంపల్లి నియజకవర్గ లో ప్రజల సమస్యల పరిష్కారం,పార్టీ బలోపేతానికి కృషి చేస్తా.. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రేణికుంట్ల ప్రవీణ్



బెల్లంపల్లి, అక్టోబర్ 14, (ప్రజాకలం) ప్రతినిధి

బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రాష్ట్ర నాయకులు రేణికుంట్ల ప్రవీణ్ అన్నారు.బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కెసిఆర్ సారధ్యంలో ప్రత్యేక రాష్ట్రం అయ్యేంతవరకు తాను ఎంతో కృషి చేసానని,ఉద్యమ సమయంలో బెల్లంపల్లి నియోజకవర్గంలో కీలకపాత్ర పోషించిన తనను కెసిఆర్ గుర్తించి బాధ్యతలు అప్పగించారన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత అప్పుడున్న టిఆర్ఎస్ అధికారంలోకి రాగా కెసిఆర్ నన్ను పిలిచి చట్టసభలోకి అవకాశం కల్పిస్తానని, చట్టసభల్లోకి వెళ్లలేకపోవడంతో 2017లో మంచిర్యాల జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ గా నియమించారన్నారు. రెండవసారి టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎస్సీ ఎస్టీ రాష్ట్ర కమిషన్ సభ్యునిగా బాధ్యతలు అప్పగించారన్నారు. ఇచ్చిన రెండు అవకాశాలకు గ్రంథాలయాలను పున: ప్రారంభం చేసి,గ్రంథాలయాల అభివృద్ధి చేపడుతూ, విద్యార్థులకు మంచి అవకాశం వచ్చేలా తీర్చిదిద్దానన్నారు.. ఎస్సీ ఎస్టీ రాష్ట్ర కమిషన్ సభ్యునిగా ఎస్సీ ఎస్టీ కేసుల్లో పురోగతిని పరిశీలించి కేసులను పరిష్కరించే విధంగా కృషి చేశానన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో ప్రజల పక్షాన ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా, యువతను చైతన్యవంతులను చేస్తూ బిఆర్ఎస్ పార్టీ లో వారికి పెద్ద పీట వేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బెల్లంపల్లిలో జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.... ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు, తదితరులు పాల్గొన్నారు...

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 14 (ప్రజాకలం):జగిత్యాల: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాల ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, జాబితాలోని వివరాల్లో తప్పులు ఉన్నవారు సవరణలు చేయించుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని, అర్హులైన వారెవరూ ఓటు హక్కుకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు, పేరు తొలగింపు, చిరునామా మార్పు, ఇతర వివరాల సవరణలకు సంబంధించి అవసరమైన దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు. ప్రజలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సంప్రదించి ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావాలని అధికారులు సూచించారు.జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు రెండు రోజులూ తప్పనిసరిగా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లను పరిశీలించుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువత, ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటర్లు తమ వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కోరారు.

ప్రజా కలం
గురువారం, అక్టోబర్ 15, 2026

జీవజాతుల వినాశనం..

మానవాళికి హెచ్చరిక!

భూమిపై ప్రతి జీవికీ ఒక ప్రత్యేక స్థానం, ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో ఒక విశిష్ట పాత్ర ఉన్నాయి. చిన్న కీటకం నుంచి భారీ వృక్షం వరకు ప్రతి జీవీ ప్రకృతి మనుగడలో భాగస్వామే. అలాంటి జీవజాతులు ఒక్కొక్కటిగా అంతరించిపోతుండటం మానవాళి భవిష్యత్తుకు ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ప్రకృతిలో ఒక జాతి అంతర్ధానమైతే దాని ప్రభావం ఆ జీవికే పరిమితం కాదు. ఆహార గొలుసు, పర్యావరణ సమతుల్యత, చివరకు మానవ జీవనోపాధిపైనా పడుతుంది. జీవవైవిధ్య పరిరక్షణ కేవలం పర్యావరణ సమస్య కాదు. భావితరాల భద్రతతో ముడిపడిన జీవన్మరణ సమస్య. ప్రపంచవ్యాప్తంగా జీవజాతుల ఉనికి ఎంతటి సంక్షోభంలో ఉందో అంతర్జాతీయ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఐపిబీఈఎస్ 2019 అంచనాల ప్రకారం దాదాపు పది లక్షల వృక్ష, జంతు జాతులు అంతరించిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. మానవ కార్యకలాపాల కారణంగా భూమిపై దాదాపు 75 శాతం భూఆధారిత పర్యావరణం గణనీయమైన మార్పులకు గురైంది. అడవుల నరికివేత, సహజ ఆవాసాల విధ్వంసం, కాలుష్యం, వనరుల అతివినియోగం, వాతావరణ మార్పులు ఈ సంక్షోభానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. భారతదేశంలోనూ అనేక అరుదైన జీవజాతుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. భారత వన్యప్రాణి సంస్థ 2024-25 నివేదిక ప్రకారం గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షుల సంఖ్య సుమారు 140 మాత్రమే. లెస్సర్ ఫ్లోరికన్ పక్షుల సంఖ్య దాదాపు 800గా అంచనా. ఈ రెండు పక్షి జాతులూ అత్యంత తీవ్రమైన అంతరించే ముప్పును ఎదుర్కొంటున్నాయి. సహజ పచ్చికభూముల విస్తీర్ణం తగ్గిపోవడం, విద్యుత్ తీగలను ఢీకొనడం వంటి ప్రమాదాలు వాటి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. తూర్పు హిమాలయాల్లో కనిపించే రెడ్ పాండా పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది. అడవుల క్షీణత, వెదురు వనాల నష్టం, సహజ ఆవాసాలు విడిపోవడం దాని మనుగడకు సవాళ్లుగా మారాయి. వన్యప్రాణులను కాపాడటమంటే వాటికి ఆశ్రయం కల్పించడం మాత్రమే కాదు. అవి స్వేచ్ఛగా సంచరించే అడవులను, ఆహారం అందించే వనరులను, సంతానోత్పత్తికి అనువైన సహజ పరిస్థితులను పరిరక్షించడం కూడా అవసరం. ప్రకృతి మనకు అందించే సేవలు అమూల్యమైనవి. తేనెటీగలు పరాగసంపర్కం ద్వారా పంటల ఉత్పత్తికి తోడ్పడతాయి. వానపాములు నేల సారాన్ని పెంపొందిస్తాయి. పక్షులు హానికరమైన కీటకాల నియంత్రణలో కీలకపాత్ర పోషిస్తాయి. మడ అడవులు తీరప్రాంతాలకు సహజ రక్షణగా నిలుస్తాయి. జీవవైవిధ్యం దెబ్బతింటే వ్యవసాయ దిగుబడులు, ఆహార భద్రత, నీటి వనరులు, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో జీవవైవిధ్య పరిరక్షణకు సమగ్ర కార్యాచరణ అవసరం. సహజ అడవులు, పచ్చికభూములు, చిత్తడి నేలలు, చెరువులను సంరక్షించాలి. వన్యప్రాణుల సంచార మార్గాలను రక్షించాలి. పురుగుమందుల అధిక వినియోగాన్ని తగ్గించాలి. స్థానిక విత్తనాలు, అరుదైన వృక్షజాతులను కాపాడాలి. ప్రజలు, రైతులు, గిరిజనులు, శాస్త్రవేత్తల భాగస్వామ్యంతో పరిరక్షణ కార్యక్రమాలను విస్తరించాలి. కున్మింగ్-మాంట్రియల్ ప్రపంచ జీవవైవిధ్య కార్యాచరణ చట్రం 2030 నాటికి కనీసం 30 శాతం భూభాగం, అంతర్గత జలాలు, తీరప్రాంతాలు, సముద్ర ప్రాంతాలను సమర్థంగా పరిరక్షించాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఆ లక్ష్య సాధనకు శాస్త్రీయ ప్రణాళికలు, సమర్థ పర్యవేక్షణ, ప్రజల భాగస్వామ్యం అత్యవసరం. ప్రకృతిలో ప్రతి జీవీ మనుగడకు ఒక ఆధారం. అంతరించిపోయిన జీవజాతిని తిరిగి సృష్టించడం సాధ్యం కాదు. జీవజాతులను కాపాడుకోవడమంటే ప్రకృతిపై దయ చూపడం కాదు.. మనిషి తన ఉనికిని తానే కాపాడుకోవడం!

- సి.హెచ్. ప్రతాప్

రీ సర్వే ద్వారా భూ సమస్యల శాశ్వత పరిష్కారం

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



మంచిర్యాల జిల్లా//ప్రజాకలం జిల్లా ప్రతినిధి

ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని హాజీపూర్ మండలం చందనాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో మండల తహసిల్దార్, బి-విభాగం పర్యవేక్షకులు, లక్షెట్టిపేట మండలం లింగాపూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ల్యాండ్ సర్వే రికార్డ్స్ ఎ.డి., మండల తహసిల్దార్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ భూ రికార్డుల వివరాలను పరిశీలించడం, సంబంధిత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. భూముల రీ సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని, గ్రామస్థుల భాగస్వామ్యంతో సర్వే కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పాత భూ రికార్డులలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, భూముల విస్తీర్ణం, హద్దులు, యాజమాన్య వివరాలకు సంబంధించి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. రీ-సర్వే ద్వారా ప్రతి భూమిని క్షేత్రస్థాయిలో కొలిచి, హద్దులను సాంకేతిక పరికరాల సహాయంతో వాస్తవ విస్తీర్ణాన్ని నిర్ధారించి సంబంధిత రికార్డులు, మ్యాపులను సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల సరిహద్దులలో ప్రభుత్వ భూములు, ఇతర భూముల ఆక్రమణలకు సంబంధించిన సమస్యలను రీ-సర్వే ద్వారా గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రీ-సర్వే నిర్వహించే తేదీకి సంబంధించి భూయజమానులకు ముందుగానే నోటీసులు అందజేయడం జరుగుతుందని, నోటీసులో పేర్కొన్న తేదీన భూయజమానులు తప్పనిసరిగా తమ భూముల వద్ద అందుబాటులో ఉండాలని, వాస్తవ హద్దులను సర్వే సిబ్బందికి చూపించి, రికార్డులలో నమోదైన విస్తీర్ణం, క్షేత్రస్థాయిలో ఉన్న విస్తీర్ణాన్ని పరిశీలించుకోవాలని తెలిపారు. తద్వారా భూముల హద్దుల విషయంలో తలెత్తే వివాదాలను తగ్గించడంతో పాటు, భూముల యాజమాన్య వివరాలను స్పష్టంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు.

కూరగాయల సాగుతో అధిక దిగుబడి

- ఉద్యాన శాఖ రాయితీలతో రైతులకు అదనపు ఆదాయం
- ఉద్యాన విస్తరణ అధికారి బోడుకల రాము

పెద్దపల్లి,అక్టోబర్ 14:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ప్రస్తుతం నెలకొన్న సూపర్ ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు తక్కువ నీటితో సాగు చేయగల కూరగాయల పంటల సాగుకు ముందుకు రావాలని పాలకుర్తి మండల ఉద్యాన విస్తరణ అధికారి బోడుకల రాము పిలుపునిచ్చారు. బుధవారం పాలకుర్తి మండలంలోని పలు గ్రామాల్లో సాగవుతున్న పండ్ల తోటలు, పామాయిల్ మరియు కూరగాయల క్షేత్రాలను ఆయన పరిశీలించి,ఆధునిక సాగు పద్ధతులు,యాజమాన్యం,ఉద్యాన శాఖ అందిస్తున్న వివిధ రాయితీ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రైతులు దుర్గం మధునయ్య, చిరుగు గోవర్ధన్,బడిగేల గట్టయ్య సాగు చేస్తున్న పామాయిల్ తోటలో అంతర పంటగా వేసిన బొప్పాయి, సరుగుడు పంటలతో పాటు వెదురు కర్రల ఆధారంతో సాగు చేస్తున్న కాకర తోటను ఆయన పరిశీలించారు.పామాయిల్‌లో ఇలాంటి అంతర పంటలు వేయడం ద్వారా స్థానిక పెద్దపల్లి మార్కెట్‌లో మంచి ధర లభించి రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఆయన తెలిపారు.కూరగాయల సాగులో ఆధార కర్రల ఏర్పాటుకు హెక్టారుకు రూ. 10వేలు శాశ్వత పందిళ్ల



నిర్మాణానికి 1లక్ష,మల్చింగ్ షీట్‌కు రూ.20వేలు వరకు రాయితీ లభిస్తుందని, అలాగే బిందు,తుంపర సేద్య పరికరాలతో పాటు మినీ ట్రాక్టర్లు,పవర్ స్ప్రేయర్ల వంటి వ్యవసాయ యంత్రాలను 50 శాతం రాయితీపై అందిస్తున్నామని వివరించారు. ఎల్ నినో ప్రభావాన్ని అధిగమించేందుకు నీటిని పొదుపుగా వాడుకుంటూ,ప్రభుత్వం అందించే ఈ రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకొని కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు గడ్డం మధునయ్య,మల్లమ్మ,బడిగేల గట్టయ్య, చిరుగు గోవర్ధన్,పామాయిల్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్,జైన్ కంపెనీ ఫీల్డ్ కో-ఆర్డినేటర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు క్రమశిక్షణతో పనిచేయాలి



- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,అక్టోబర్14:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో క్రమశిక్షణతో కూడిన పరిపాలన అందించాలని,ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ విధులకు హాజరయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు జే. అరుణశ్రీ, బి.శ్రీరాములుతో కలిసి వివిధ పరిపాలన అంశాలపై జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ప్రతి ఉద్యోగి సమయానికి విధులకు హాజరుకావాలని, ఉద్యోగుల హాజరును అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని తెలిపారు.ప్రతి ఉద్యోగి మీ ప్రమాణం యాప్‌లో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని,ఉద్యోగుల హాజరును ఈ యాప్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు తమ పర్యటనలకు సంబంధించిన టూర్ డైరీలను ప్రతి నెలా తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. విధుల నిర్వహణలో పారదర్శకత,జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు.ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులు,సమాచార హక్కు చట్టం దరఖాస్తులు,ప్రజావాణి ఫిర్యాదులు,ఇతర పెండింగ్ ఫైళ్లను నిరంతరం సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ అంశాల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని,వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రతి ప్రభుత్వ కార్యాలయం, కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.కార్యాలయ భవనాలు,పరిసరాల పరిశుభ్రతను కాపాడటం సంబంధిత అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు.కార్యాలయాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా నిరంతరం చర్యలు చేపట్టాలని సూచించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పరిపాలనా పరమైన అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని, పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో అందరూ జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

దసరా సెలవుల్లో ప్రత్యేక ఆధార్ నమోదు, అప్‌డేట్ క్యాంపులు : జిల్లా విద్యాశాఖాధికారిణి వాసంతి

ఖమ్మం, అక్టోబర్ 14(ప్రజా కలం న్యూస్) ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, సాధారణ ప్రజల సౌకర్యార్థం ఈ దసరా సెలవుల్లో ప్రత్యేక ఆధార్ నమోదు, అప్‌డేట్ క్యాంపులను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి డి. వాసంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు విద్యాధికారిణి తెలిపారు. ఈ ప్రత్యేక క్యాంపులలో నూతన ఆధార్ నమోదుతో పాటు, విద్యార్థులకు అత్యంత కీలకమైన పెండింగ్ బయోమెట్రిక్ అప్‌డేట్లు, సాధారణ ప్రజలకు అవసరమైన ఇతర ఆధార్ సేవలు అందించబడతాయని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ, పెండింగ్ బయోమెట్రిక్ అప్‌డేట్లు ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ సమాచారాన్ని చేరవేసి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని జిల్లా విద్యాధికారిణి ఆదేశించారు. ఆధార్ సేవల కొరకు యుఐడిఎఐ నిర్ణయించిన ప్రామాణిక నిబంధనల ప్రకారమే రుసుములు వసూలు చేయాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అదనపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారిణి హెచ్చరించారు. జిల్లాలోని విద్యార్థులు, తల్లిదండ్రులు, సాధారణ ప్రజలందరూ తమ సమీపంలోని మండల వనరుల కేంద్రం లేదా కేటాయించిన జూనియర్ కళాశాలల్లో సంప్రదించి ఈ దసరా సెలవుల్లో ఆధార్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా వైద్యాధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం.. అమ్మవారికి పూజలు

రాఘవాపూర్ లో ప్రభుత్వ విప్ విజయరమణ రావు పర్యటన

పెద్దపల్లి,అక్టోబర్ 14:
(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు అన్నారు.పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన రాఘవాపూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా యువ క్రీడాకారులను ఉత్సాహపరుస్తూ వారికి క్రీడా



దుస్తులు,బ్యాట్లను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కొలువుదీరిన దుర్గా మాత మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, నిత్య అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా ప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్, వివిధ గ్రామాల సర్పంచులు,స్థానిక ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,గ్రామస్థులు, క్రీడాకారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో సబ్ కోర్ట్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందించిన బెల్లంపల్లి బార్ అసోసియేషన్



బెల్లంపల్లి, అక్టోబర్ 14, (ప్రజాకలం) ప్రతినిధి హైకోర్టు జస్టిస్ భీమపాక నగేష్ నీ బెల్లంపల్లి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మెరుగు శ్రీనివాస్,వైస్ ప్రెసిడెంట్ ఉమెన్ నలుల సంగీత,లైబ్రెరియన్స్ సెక్రెటరీ సజ్జనపు సంతోష్ కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసారు. బెల్లంపల్లిలో సబ్ కోర్ట్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందచేశారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మెరుగు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం సబ్ కోర్ట్ మంచిర్యాలలో ఉండడం వల్ల బెల్లంపల్లి ప్రాంత కక్షిదారులకు దూరంతోపాటు,ఖర్చు అవుతుందన్నారు.బెల్లంపల్లిలో సబ్ కోర్ట్ ఏర్పాటు చేస్తే కక్షిదారులకు ఖర్చు బారం పడకుండా,సమయం పాలన ఉంటుందన్నారు.హైకోర్టు జస్టిస్ కి వినతిపత్రం అందచేశామన్నారు.

హెచ్ఎన్‌డీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 14 (ప్రజాకలం):- మెట్‌పల్లి పట్టణంలోని హనుమాన్ నగర్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్ఎన్‌డీఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఏడో వార్డు కౌన్సిలర్,



బీజేపీ ఫ్లోర్ లీడర్ ధర్మపురి స్వరూప వేణుగోపాల్ కొబ్బరికాయ కొట్టి అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ నగర్ డెవలప్‌మెంట్ సొసైటీ కమిటీ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

బూదాఖుర్దు లో కేపీఎల్ సీజన్-3 క్రికెట్ టోర్నమెంట్



బెల్లంపల్లి, అక్టోబర్ 14, (ప్రజాకలం) ప్రతినిధి మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని బూదాఖుర్దు గ్రామపంచాయతీ లో కేపీఎల్ సీజన్ -3 నీ కాసిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాదర్ స్వామి హాజరయ్యారు. బుధాఖుర్దు యూత్ క్రికెట్ టీమ్స్ సభ్యుల పరిచయం అనంతరం సర్పంచ్ కాస్ వేయగా నాదర స్వామి క్రికెట్ ఆట ఆడి టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడలు మానసిక ఉల్లాసానికి,శారీర ధృవత్వానికి ఉపయోగపడతాయన్నారు. యువత మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంటూ,చదువు, క్రీడల పట్ల ఆసక్తి చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ అధికారిక ప్రతినిధి బత్తుల రవి, సీనియర్ నాయకులు ఎంబడి సురేష్,బండి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు..

ఘనంగా మహా చండీ యాగం



మల్లాపూర్, అక్టోబర్ 14 (ప్రజా కలం ప్రతినిధి): మల్లాపూర్ మండలం కొత్త ధాంరాజ్‌పల్లి గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి సేవా సమితి 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారి మండపం వద్ద మహా చండీ యాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఐదుగురు అర్చకుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య యాగ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు.ఈ కార్యక్రమం లో భవాని భక్తులు,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ఓడి బియ్యం పట్టు వస్త్రాలు సమర్పించిన సర్పంచ్

ఎండపల్లి, అక్టోబర్ 14 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని చర్లపల్లి గ్రామంలో బుధవారం రోజున గ్రామ సర్పంచ్ పడిదం లావణ్య-మొగిలి ఆధ్వర్యం లో దుర్గాదేవి నవరాత్రులలో భాగంగా దుర్గామాత సన్నిధిలో దుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్య క్రమాలు నిర్వహించి, దుర్గ అమ్మవారికి ఓడి బియ్యం పోసి దుర్గ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ పడిదం లావణ్య మొగిలి, భవాని భక్తులు, మహిళలు, పిల్లలు పాల్గొన్నట్లు గ్రామ సర్పంచ్ పాడిదం లావణ్య-మొగిలి తెలిపారు.



జాతీయస్థాయి బ్యాట్మింటిన్ పోటీలలో గురుకుల విద్యార్థి ప్రతిభ



ధర్మారం, అక్టోబర్ 14 : (ప్రజా కలం ప్రతినిధి)

మండలంలోని నంది మేడారం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కళాశాల లో ఇంటర్మీడియట్ (బైపిసి) మొదటి సంవత్సరం చదువుతున్న బండారి కళ్యాణి 72వ సీనియర్ జాతీయ బాల్ బ్యాట్మింటన్ ఛాంపియన్షిప్ పోటీల లో మూడవ స్థానం లో నిలిచి ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ జి విజయ తెలిపారు. సెప్టెంబర్ 24 నుండి 28 వరకు ఎస్ వి ఆర్ట్స్ కాలేజ్, మహిళా డిగ్రీ కాలేజ్ శ్రీ కాళహస్తిలో పోటీలు జరిగినట్లు పేర్కొన్నారు. గతం లో కళ్యాణి ఎనిమిది సార్లు రాష్ట్రస్థాయి పోటీల లో పాల్గొన్నట్లు వెల్లడించారు. జాతీయ స్థాయిలో మూడో స్థానం సాధించిన కళ్యాణిని ప్రిన్సిపల్ విజయ తో పాటు వ్యాయామ ఉపాధ్యాయు లు భాగ్యలక్ష్మి, నర్మదా అభినందిస్తూ భవిష్యత్తు లో మరింత ఉన్నతంగా రాణించాలని వారు ఆకాంక్షించారు.

శాంతిభద్రతల పరిరక్షణకే తొలి ప్రాధాన్యం

-పెద్దపల్లి పట్టణ ఎస్‌హెచ్‌ఓగా జి.రాజశేఖర్ బాధ్యతల స్వీకరణ

పెద్దపల్లి,అక్టోబర్ 14:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా ఎస్సై జి.రాజశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ స్టేషన్‌లో లాంఛనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు తోటి సిబ్బంది,పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని,బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు.నేరాల నియంత్రణ,రాత్రి గస్తీ ముమ్మరం చేయడంతో పాటు గంజాయి, పేకాట,అక్రమ మద్యం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని,చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలంతా పోలీసు శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన కోరారు.



గంజాయితో ఉన్న వ్యక్తిని పట్టుకొని అరెస్టు చేసిన పోలీసులు



ధర్మారం, అక్టోబర్ 14 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని దొంగతుర్తి గ్రామ శివారు లో బుధవారం రోజున మధ్యాహ్నం అందాద 3:00 గంటలకు దొంగతుర్తి గ్రామా శివారు లో సయ్యద్ తాజ్ బాబా, రంగంపల్లి గ్రామం అను వ్యక్తి గంజాయి తో ఉండగా అతడిని పట్టుకుని విచారించగా అతని వద్ద 45 గ్రాముల గంజాయి దొరికినది. ఇట్టి దానిని సీజ్ చేసి అతని పై కేసు నమోదు చేయనైనది ఈ కార్యక్రమం లో ఎస్సై ఎంబడి శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నట్లు ధర్మారం ఎస్సై ఎంబడి శ్రీకాంత్ తెలిపారు.

భూముల రీ సర్వే తో రైతులకు పరిష్కారం లభిస్తుంది

- జిల్లా కలెక్టర్ సత్య శారద



(వరంగల్/ పర్వతగిరి) అక్టోబర్ 14, ప్రజాకలం ప్రతినిధి:

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే తో రైతులకు పరిష్కారం లభిస్తుందని 100 సంవత్సరాల క్రితం జరిగిన భూ సర్వే ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి ముందుకు పోతుందని వరంగల్ కలెక్టర్ సత్య శారద తెలిపారు. బుధవారం గోపనపల్లి గ్రామంలో జరిగిన భూ రీసర్వే గ్రామ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. భూములను తగాదాలు లేకుండా సర్వే అధికారులు వచ్చినప్పుడు కొలతకు సహకరించి హద్దులు చూపించాల్సిందిగా ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రతి రైతుకు ఒక భూమి ఆధార్ నెంబర్ ఇవ్వడం జరుగుతుందని భవిష్యత్తులో ఎలాంటిది భూ సమస్యలకు తావు లేకుండా పరిష్కారం లభిస్తుందని ఆమె తెలిపారు. అలాగే ఎల్ నేనో ప్రభావం తెలంగాణపై ఎక్కువగా ఉన్నందున రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని వరి ధాన్యాన్ని వచ్చే యాసింగికి వేయకుండా ఉండడమే మంచిది అని కరెంటు కూడా అనుకూలత లభ్యత లేని కారణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి చౌటపల్లి సొసైటీ చైర్మన్ లు అనిల్ రావు, కుమారస్వామి, మార్కెట్ డైరెక్టర్ గొడుగు భిక్షపతి, గోపనపల్లి సర్పంచ్ నాంపల్లి విజయ, అనంతారం సర్పంచ్ తౌడు శ్రీలత, ఎమ్మార్వో వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్ నాయక్ వివిధ గ్రామాల నుండి వచ్చిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

కౌన్సిలర్ అక్కేపల్లి సుజాత - రంగంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా దసరా,బతుకమ్మ సంబరాలు

పెద్దపల్లి,అక్టోబర్ 14:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి జిల్లా రంగంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రథమ్ విద్యా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దసరా సెలవులను పురస్కరించుకుని బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలు,మహిళలకు బతుకమ్మ సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ వేడుకలకు రంగంపల్లి కౌన్సిలర్ అక్కేపల్లి క్రాంతికుమార్ సుజాత ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ అక్కేపల్లి సుజాత మాట్లాడుతూ దసరా,బతుకమ్మ పండుగలు తెలంగాణ సంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీకలని కొనియాడారు. సెలవుల్లో పిల్లలు కేవలం ఇళ్లకే పరిమితం కాకుండా ఇలాంటి ఆటల పోటీల్లో పాల్గొనడం వల్ల వారిలో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం మరియు సృజనాత్మకత పెంపొందుతాయని తెలిపారు.అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న విద్యా శిబిరాలు,సమాజ భాగస్వామ్య కార్యక్రమాల ప్రాధాన్యతను స్థానికులకు,తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఇలాంటి సేవా



కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

రంగురంగుల పూలతో మహిళలు బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. అదేవిధంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ క్రీడా పోటీలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.అనంతరం ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు,కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న వారందరికీ అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రథమ్ సంస్థ ప్రతినిధులు శైలజ, నిరీషలతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు,స్థానిక ప్రజాప్రతినిధులు,విద్యార్థులు,వారి తల్లిదండ్రులు,గ్రామ మహిళలు పాల్గొన్నారు.

ఆడబిడ్డల ఆత్మగౌరవం,సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ - కలెక్టరేట్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 14 (ప్రజాకలం)

బతుకమ్మ సంబరాల్లో భాగంగా బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించగా ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవం సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ పేర్కొన్నారు.మహిళలు సమిష్టిగా బతుకమ్మ ఆడటం వల్ల సాంఘీక ఐక్యత బలపడుతుందని తెలిపారు.తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజు ప్రత్యేకమైన పేర్లతో బతుకమ్మ పండగ మహిళలు నిర్వహిస్తారని, ఐదవ రోజు అట్ల బతుకమ్మ – అట్లు (దోశెలు) బతుకమ్మ – కాగా ప్రకృతి ప్రసాదించిన తంగేడు, గునగ, బంతి, రంగు రంగుల పూలతో బతుకమ్మను అలంకరించి మహిళలు ఆట,పాటలతో పండుగ చేసుకోవడం నిజంగా కన్నులపండుగలా ఉందని ఈ వేడుకల్లో పాల్గొనడం అనందంగా ఉందన్నారు. అందరికి బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా అధికారులు,సిబ్బంది ఉత్సాహకంగా బతుకమ్మ పాటలు పడుతూ బతుకమ్మ ఆడారు. మహిళలు బతుకమ్మ నిమజ్జనం సమయంలో చెరువులు, కుంటలు, వాగుల వద్ద జాగ్రత్త వహించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ నిమజ్జనం ఏర్పాట్లు చేసినట్లు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, డిడబ్ల్యూవో భాస్కర్,మహిళలు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజారాంపల్లి గ్రామం లో ఘనంగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు

- గ్రామ సర్పంచ్ సంఘు రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో
- ఆడబిడ్డలకు చీరలు, పసుపు, కుంకుమ, గాజుల పంపిణీ, అన్న ప్రసాద వితరణ
- ముఖ్య అతిథులుగా మంత్రి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మద్దుల

ఎండపల్లి, అక్టోబర్ 14 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని రాజారాంపల్లి గ్రామం లో గ్రామ సర్పంచ్ సంఘు రమేష్ యాదవ్ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రోజున గ్రామంలోని దేవి మండపం వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఆడబిడ్డలందరికీ చీరలు, పసుపు, కుంకుమ, గాజులు అందజేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే సంజయ్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి హాజరయ్యారు. ముఖ్య అతిథులతో కలిసి గ్రామ సర్పంచ్ సంఘు రమేష్ యాదవ్ స్వంత ఖర్చులతో మహిళలకు చీరలు, పసుపు, కుంకుమ, గాజులను పంపిణీ చేశారు. దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన అన్న ప్రసాద వితరణ, ఆడబిడ్డలకు చీరలు మరియు సాంప్రదాయ మంగళ ద్రవ్యాల పంపిణీ కార్యక్రమం గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపింది. మహిళలను గౌరవించడం, సంప్రదా యాలను కాపాడటం, గ్రామ ప్రజల మధ్య ఆప్యాయతను పెంపొందించడం వంటి మంచి సందేశాన్ని కలిగిస్తున్నారని గ్రామ సర్పంచ్ సంఘు రమేష్ యాదవ్ ను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మద్దుల గోపాల్ రెడ్డి ముఖ్య అతిథులు



అందరూ కలిసి సంఘు రమేష్ యాదవ్ ను అభినందించారు. గ్రామ సర్పంచ్ సంఘు రమేష్ ఆధ్వర్యం లో నిర్వహించిన ఈ కార్య క్రమం లో ముఖ్య అతిథులు పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తిశ్రద్ధల తో నిర్వహించిన దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదానం, మహిళలకు వస్త్రాల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల గ్రామ సోదరీమణులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమం లో ఎండపల్లి మండల అధ్యక్షులు గెల్లు చంద్ర శేఖర్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేష్, గాజుల లక్ష్మణ్ గెల్లు శ్రీనివాస్, గాజుల విజయ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, భవాని భక్తులు, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

దీన్ దయాల్ నగర్‌లో 20 లక్షలతో వడ్డెర కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన

చేసిన ఎమ్మెల్యే నాయిని,తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు



హనుమకొండ అక్టోబర్ 14 ప్రజా కలం ప్రతినిధి హనుమకొండ హంటర్ రోడ్ 31వ డివిజన్ పరిధిలోని దీన్ దయాల్ నగర్ కాలనీలో వడ్డెర కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజుతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలోనే 31వ డివిజన్ అభివృద్ధికి సుమారు రూ.20 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు.ఇప్పటికే 85 శాతం రోడ్ల నిర్మాణం పూర్తయిందని,మిగిలిన పనులను త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు.ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.జేపీ నగర్ ఫేజ్-2 ప్రధాన రహదారి పనులకు వారం రోజుల్లో శంకుస్థాపన చేస్తామని,డివిజన్‌లో అర్హులైన నిరుపేదలకు సుమారు 2,000 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందించే దిశగా కృషి చేస్తామని తెలిపారు.తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కమ్యూనిటీ హాల్‌తో పాటు సీసీ రోడ్లు,డ్రైనేజీ పనులకు సహకరించిన ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సత్తు రమేష్,మాజీ అధ్యక్షుడు అంకేశ్వరపు సురేందర్,మాజీ కార్పొరేటర్,వడ్డెర సంఘం పెద్దలు,జేపీ నగర్ ఫేజ్-2 కాలనీ ప్రతినిధులు, కాంగ్రెస్‌నాయకులు,కార్యకర్తలు,కాలనీ వాసులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు అప్పన్నపేట విద్యార్థులు ఎంపిక

పెద్దపల్లి,అక్టోబర్ 14:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఈ నెల 15 నుంచి 17 వరకు జరగనున్న జూనియర్ రాష్ట్రస్థాయి ఖో-ఖో క్రీడా పోటీలకు మండల పరిధిలోని అప్పన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు.తెలంగాణ ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీలకు తమ పాఠశాలకు చెందిన పంబాల అస్మిత,దారవేణి సూర్యతేజ ప్రతిభ చూపి ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ వేల్పుల సురేందర్ తెలిపారు.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై పాఠశాల పేరును నిలబెట్టిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం ప్రత్యేకంగా అభినందించారు. క్రీడల్లో విద్యార్థులు మరింత రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్, రాజేశ్వరరావు, కనకయ్య,సారయ్య, శ్రీనివాస్,భాస్కర్,శ్రీదేవి, సోనీ,వాసంతి, జ్యోతి,పద్మ,అనుష తదితరులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.



ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాల్గొన్న నాయకులు



గొల్లపల్లి అక్టోబర్ 14 ప్రజా కలం ప్రతినిధి : గొల్లపల్లి మండలం లోత్తునూరు గ్రామానికి చెందిన ఓరుగంటి మరియమ్మ ,నర్సయ్య ల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా నాయకులను లబ్దిదారులు శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా సంతోష్, గ్రామ సర్పంచ్ ఆకుల సుమన్ గౌడ్ పార్టీ అధ్యక్షుడు రాపల్లి గంగన్న,జిల్లా ఉపాధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి ,జనరల్ సెక్రటరీ అనిల్ ,సర్పంచ్ గంగాచారి ఎస్సీసెల్ మండల అధ్యక్షులు జాను, వెంకటేష్,లక్కం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

గంజాయి పట్టివేత నిందితుడు అరెస్ట్



పెద్దపల్లి,అక్టోబర్ 14:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) యువతను పెడదోవ పట్టిస్తున్న మత్తు పదార్థాల విక్రయాలపై ఉక్కుపాదం మోపుతూ,సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై ఎలాంటి మొహమాటం లేకుండా కఠిన చర్యలు కొనసాగుతాయని పెద్దపల్లి రూరల్ ఎస్సై నాయిని మధుకర్ అన్నారు. మండలంలోని పెద్దకల్వల గ్రామ శివారులో బుధవారం పోలీసులు పెద్దకల్వల గ్రామ శివారులో తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా,బోజన్నపేట గ్రామానికి చెందిన జక్కుల అరుణ్ అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడని ఎస్సై తెలిపారు.వెంటనే అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా,అతని వద్ద 64.85 గ్రాముల గంజాయి లభించిందన్నారు.పోలీసులు ఆ గంజాయిని స్వాధీనం చేసుకుని,మార్కెట్ ధర ప్రకారం దాని విలువ సుమారు రూ. 3,250 ఉంటుందని అంచనా వేసినట్లు ఆయన వివరించారు.ఈ ఘటనపై నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశామని ఎస్సై నాయిని మధుకర్ తెలిపారు.ఈ గంజాయి సరఫరా వెనుక ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో కూపీ లాగుతున్నామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని వదిలేది లేదని ఆయన హెచ్చరించారు.యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని,ఎక్కడైనా గంజాయి విక్రయాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

అమ్మవారికి 108 భోగాలు సమర్పించిన మహిళలు

గొల్లపల్లి అక్టోబర్ 14 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండలం లోత్తునూరు గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నవదుర్గ సేవ సమితి ఆధ్వర్యంలో అమ్మవారికి 108 రకాల భోగాలను మహిళలు సమర్పించారు.పురోహితులు నర్సింగోజు సాయి చరణ్ చారి,కట్ట శ్రవణ్ చారి ఆధ్వర్యంలో ఉదయం వేదమంత్రోచ్చరణ మధ్య ప్రత్యేక పూజలు అభిషేకం నిర్వహించగా అమ్మవారు శ్రీ మహాచండి దేవి అవతారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు.మహిళలు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి 108 రకాల భోగాలు స్వయంగా తయారు చేసి అమ్మవారికి సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.అనంతరం భక్తులకు గజకేశరి ఇండస్ట్రీస్ రైస్ మిల్‌హౌ సురేష్,శివ వారు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.అనంతరం మహిళలు అట్లా బతుకమ్మ ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో దీక్ష స్వాములు ,మహిళలు, యువకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



గుండె రక్తనాళాల్లో తీవ్రమైన కాల్షియం అడ్డంకికి అధునాతన చికిత్స

వరంగల్ మెడికవర్ వైద్యుల ఘనత- వరంగల్ ట్రై సిటీలో తొలిసారిగా అధునాతన సాంకేతికతతో కరోనరీ యాంజియోప్లాస్టీ



హనుమకొండ అక్టోబర్ 14
ప్రజా కలం ప్రతినిధి

వెడికవర్ హాస్పిటల్స్ వరంగల్‌లో అత్యాధునిక ఆర్బిటల్ అథెరెక్టమీ సాంకేతికతను ఉపయోగించి సంక్లిష్టమైన కరోనరీ యాంజియోప్లాస్టీని వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. గుండె రక్తనాళాల్లో తీవ్రంగా కాల్షియం పేరుకుపోయిన క్లిష్టమైన కేసులో ఈ అధునాతన సాంకేతికతను ఉపయోగించడం ద్వారా వరంగల్ ట్రై సిటీ ప్రాంతంలో గుండె వైద్య సేవల్లో మెడికవర్ హాస్పిటల్స్ మరో కీలక ముందడుగు వేసింది. డయాబెటిస్‌తో బాధపడుతున్న 75 ఏళ్ల పురుషుడికి నిర్వహించిన వైద్య పరీక్షల్లో గుండె రక్తనాళంలో తీవ్రమైన అడ్డంకితో పాటు అధికంగా కాల్షియం పేరుకుపోయినట్లు గుర్తించారు. రక్తనాళాల గోడల్లో కాల్షియం ఎక్కువగా పేరుకుపోయినప్పుడు సాధారణ యాంజియోప్లాస్టీ నిర్వహించడం సవాలుగా మారుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో రక్తనాళాన్ని తగిన విధంగా సిద్ధం చేయడం, స్టెంట్‌ను సమర్థవంతంగా అమర్చడం ఎంతో కీలకమని ఈ నేపథ్యంలో మెడికవర్ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సంతోష్ మోడాని అత్యాధునిక ఆర్బిటల్ అథెరెక్టమీ పరికరాన్ని ఉపయోగించి చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈసాంకేతికత రక్తనాళాల్లో పేరుకుపోయిన గట్టి కాల్షియం పొరను తగ్గించి, తదుపరి యాంజియోప్లాస్టీతో పాటు స్టెంట్ అమరికకు రక్తనాళాన్ని సిద్ధం చేయడంలో సహాయపడుతుంది. చికిత్సలో భాగంగా ఇంట్రావాస్కులర్ అల్ట్రాసౌండ్ సాంకేతికతను కూడా ఉపయోగించారు. దీని ద్వారా రక్తనాళం లోపలి పరిస్థితిని స్పష్టంగా అంచనా వేయడంతో పాటు అడ్డంకి తీవ్రతను గుర్తించి చికిత్సను మరింత ఖచ్చితత్వంతో నిర్వహించేందుకు వీలైందనీ చికిత్స విజయవంతం కావడంతో రోగి ఆరోగ్యం మెరుగుపడింది. ఈ సందర్భంగా డాక్టర్ సంతోష్ మాదాని మాట్లాడుతూ,"గుండె రక్తనాళాల్లో అధికంగా కాల్షియం పేరుకుపోయినప్పుడు యాంజియోప్లాస్టీ నిర్వహించడం వైద్యపరంగా సవాలుతో కూడుకున్నదనీ ఇలాంటి క్లిష్టమైన కేసుల్లో ఆర్బిటల్ అథెరెక్టమీ, IVUS వంటి ఆధునిక సాంకేతికతలు రక్తనాళాల పరిస్థితిని మెరుగ్గా అంచనా వేయడానికి, చికిత్సను మరింత ఖచ్చితత్వంతో నిర్వహించడానికి సహాయపడతాయి. అధునాతన వైద్య పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా క్లిష్టమైన గుండె సమస్యలతో బాధపడుతున్న రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు వీలవుతుంది" అని తెలిపారు. ఈ చికిత్సలో కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ నమ్రత,డీఎంఎస్ డాక్టర్ అనిత,మార్కెటింగ్ హెడ్ హరినాథ్ గుప్తా పాల్గొని,సంక్లిష్టమైన గుండె చికిత్సను విజయవంతంగా నిర్వహించిన కార్డియాలజీ బృందాన్ని అభినందించారు.

ఎస్.ఐ.ఆర్-2026 ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

ఓటరు నమోదు కోసం 15, 16 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 14:

ఎస్.ఐ.ఆర్-2026లో భాగంగా ఓటర్లకు నోటీసుల పంపిణీ, విచారణల ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ), 75-జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి జె.ఎల్.బి. హరిప్రియ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె ఈ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు.

98.57 శాతం నోటీసుల పంపిణీ పూర్తి...అక్టోబర్ 14 నాటికి ఎస్ఐఆర్-2026లో భాగంగా 98.57 శాతం నోటీసుల పంపిణీ, 91.23 శాతం విచారణలు పూర్తయ్యాయని సమావేశంలో వివరించారు. మిగిలిన విచారణలను గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

15, 16 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు..ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులు, ఇప్పటివరకు ఓటరుగా నమోదు కానివారు, తొలిసారిగా ఓటు హక్కు పొందనున్న యువత కోసం అక్టోబర్ 15, 16 తేదీల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన పౌరులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి, ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరాల్లో బూత్ స్థాయి అధికారులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు కూడా పాల్గొని అర్హులైన ఓటర్ల నమోదుకు సహకరించాలని కోరారు.

ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

ఒకే ఇంటిలో 15 లేదా అంతకంటే ఎక్కువ మంది ఓటర్లు నమోదై ఉన్న కుటుంబాల వివరాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని, ఓటర్ల వివరాల్లో



వ్యత్యాసాలు గుర్తిస్తే వాటిని సరిచేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ూజు=ా లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను సమీక్షించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సహాయ ఎన్నికల నమోదు అధికారులకు తెలిపారు. నోటీసుల పంపిణీ, విచారణల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి త్వరితగతిన పరిష్కరించుకునేలా సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. అర్హులైన ఓటర్లు విచారణలకు హాజరయ్యేలా, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో పాల్గొనేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్-2026 ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని హరిప్రియ సూచించారు. ఈ సమావేశంలో జడ్చర్ల, మిడ్జిల్, రాజాపూర్, బాలానగర్, ఊర్కొండ మండలాల తహసీల్దార్లు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, జడ్చర్ల మున్సిపల్ కమిషనర్, జడ్చర్ల అదనపు తహసీల్దార్, మండల డిప్యూటీ తహసీల్దార్, 75-జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన నైపుణ్య శిక్షణ ప్రాక్టికల్ పరీక్షలు

నైపుణ్య శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు

మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక సహకారం



మహబూబ్‌నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 14:

నిరుద్యోగ మహిళలకు నైపుణ్య శిక్షణ అందించి, వారిని స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించాలనే లక్ష్యంతో మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా రెండవ రోజు మహిళా అభ్యర్థులకు నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షలు రెండో రోజు ప్రశాంతంగా ముగిశాయి. గౌరవ ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి సహకారంతో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న మహిళా అభ్యర్థులకు ఈ పరీక్షలను నిర్వహించారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంతో పాటు, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని మెప్మా కార్యాలయంలో వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగ మహిళా అభ్యర్థులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. శిక్షణ సమయంలో నేర్చుకున్న అంశాలపై అభ్యర్థులకున్న అవగాహన, పనితీరు, ఆచరణాత్మక నైపుణ్యాలను అంచనా వేసే ఉద్దేశంతో ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించారు. అభ్యర్థులు తమకు అందించిన శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను పరీక్షల్లో ప్రదర్శించారు. పరీక్షల నిర్వహణ తీరును మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, ఇన్‌చార్జి నిజలింగప్ప పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా ఏర్పాట్లను పర్యవేక్షించారు. అభ్యర్థులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలో ఎలా ఉపయోగిస్తున్నారనే విషయాన్ని పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే సంప్రదాయ విద్యతో పాటు వృత్తిపరమైన నైపుణ్యాలు కూడా ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో నిరుద్యోగ మహిళలకు వివిధ కోర్సుల్లో శిక్షణ అందించడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించేలా ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో మహబూబ్‌నగర్ ఫస్ట్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

నైపుణ్య శిక్షణ ద్వారా మహిళలు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రావీణ్యం సంపాదించి, ఉద్యోగ అవకాశాలను పొందడంతో పాటు సొంతంగా ఉపాధి కార్యకలాపాలను ప్రారంభించేందుకు కూడా అవకాశం ఉంటుంది. తద్వారా కుటుంబ ఆదాయానికి తోడ్పడటంతో పాటు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చు. మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి, వారి నైపుణ్యాలను ఉపాధి అవకాశాలుగా మలచడానికి ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయి. మహిళలకు నైపుణ్య శిక్షణ అందించడం అనేది కేవలం ఒక కోర్సును నేర్పించడమే కాకుండా, వారి భవిష్యత్తుకు ఉపాధి మార్గాలను సృష్టించే ప్రక్రియగా భావించవచ్చు. సరైన శిక్షణ, ప్రాక్టికల్ అనుభవం, నిరంతర ప్రోత్సాహం లభిస్తే మహిళలు వివిధ రంగాల్లో రాణించగలుగుతారు. ఈ దిశగా నిరుద్యోగ మహిళలకు అవకాశాలు కల్పించే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. గౌరవ ప్రభుత్వ విప్ లియెన్నం శ్రీనివాస్ రెడ్డి లి సహకారంతో మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు, ఆర్థికంగా బలోపేతం కావడానికి దోహదపడతాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. శిక్షణ పొందిన మహిళలు తమ నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని వారు ఆకాంక్షించారు.

విబిజి రామ్ జీ పథకం కింద అర్హులందరికీ ఉపాధి కల్పించాలి

నీటి సంరక్షణ పనులు విరివిగా చేపట్టాలి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ అక్టోబర్ 14 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

గ్రామీణ ప్రాంతాల్లో వివిజి రామ్ జీ పథకం అమలు, అర్హులకు ఉపాధి కల్పన, నీటి సంరక్షణ పనులు చేపట్టే అంశాలపై జిల్లా కలెక్టర్ బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో వివిజి రామ్ జీ జాబ్ కార్డులు కలిగిఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకుగానూ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, క్షేత్ర సహాయకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం చేత వ్యవసాయం, తదితర అంశాల్లో ఉపాధి అవకాశాలు తగ్గే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరికీ వివిజి రామ్ జీ కింద 125 రోజుల పని కల్పించాలన్నారు. ఉపాధి కల్పన ద్వారా పేదలకు ఆర్థికంగా తోడ్పాటు అందించినట్లవుతుందన్నారు. ఈ పథకం కింద 375 రకాల పనులు చేసుకోవచ్చని, జిల్లాలో అవకాశం ఉన్న పనులు చేపట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పనికి వెళ్లేలా ప్రజల్ని ప్రోత్సహించాలని తెలిపారు. నీటి సంరక్షణ పనులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దీనిద్వారా పేదలకు ఉపాధి కల్పించడమే కాకుండా, భూగర్భ జలాల సంరక్షణకు తోడ్పడినవారమవుతామని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్ ఛార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేశ్, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, ఎంపీడీవోలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయండి

నిరుద్యోగ సమస్యలపై ఉద్యమాలకు మహాసభలు వేదిక కావాలి

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగపూర్ మధు పిలుపు



నాగర్‌కర్నూల్, అక్టోబర్ 14(ప్రజాకలం) : భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి నాగపూర్ మధు పిలుపునిచ్చారు. అక్టోబర్ 24, 25 తేదీల్లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో నిర్వహించనున్న మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో యువత, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారం కోసం భవిష్యత్తు ఉద్యమాలకు కార్యాచరణ రూపొందించేందుకు ఈ మహాసభలు వేదికగా నిలవనున్నాయని తెలిపారు. డీవైఎఫ్ఐ అనేక యువజన ఉద్యమాలను నిర్వహిస్తూ యువత సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌లోని హామీలను అమలు చేయకుండా నిరుద్యోగులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగ నియామకాలు చేపడతామని చెప్పిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా యువజన ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్న సుమారు 600 మంది ప్రతినిధులతో పాటు మేధావులు ఈ మహాసభల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా డీవైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు ఎం.ఏ. రహీం హాజరుకానున్నారని వెల్లడించారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని డీవైఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని నాగపూర్ మధు కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ. కురుమయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఆంజనేయులు, శ్రీశైలం, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులు అందించాలి

- ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందికొండ గీత డిమాండ్



నాగర్‌కర్నూల్అక్టోబర్ 14 (ప్రజా కలం): తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు 14 రకాల నిత్యావసర సరుకులు అందించాలని ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందికొండ గీత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఐద్వా ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కందికొండ గీత మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి డిసెంబర్ నాటికి మూడేళ్లు పూర్తికావస్తున్నప్పటికీ, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు 14 రకాల నిత్యావసర వస్తువులు అందిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడం లేదని ఆరోపించారు. ఒకవైపు వర్షాభావ పరిస్థితులు, మరోవైపు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో పేదలు, కార్మికులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్, పెట్రోల్, బియ్యం, పంచదార వంటి నిత్యావసరాల ధరలు పెరగడంతో సామాన్య ప్రజలకు కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ముఖ్యంగా ఉల్లిగడ్డల ధర కిలోకు రూ.75కు చేరడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. పక్క రాష్ట్రాల్లో ఉల్లిగడ్డలను సైతం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేస్తున్నప్పుడు తెలంగాణలో ఎందుకు అందించడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ధరల పెరుగుదలతో సతమతమవుతున్న ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను అందుబాటులోకి తీసుకురావాలని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ప్రజలను ఆదుకోవాలని కందికొండ గీత డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో లక్ష్మి, కృష్ణవేణి, భాగ్యమ్మ, అలివేలు, బురాన్ బేగం, అమీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో భూ రీసర్వే పనులను పరిశీలన

- అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ



మహబూబ్నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 14:

జిల్లాలో చేపడుతున్న భూ రీసర్వే పనులను వేగవంతం చేసి, నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ అధికారులను ఆదేశించారు. జడ్చర్ల మండలం ఖానాపూర్ గ్రామంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను అదనపు కలెక్టర్ పరిశీలించి, పురోగతిని సమీక్షించారు. నూతనంగా ఏర్పాటు చేసిన, శిక్షణ పొందిన రెండు రీసర్వే బృందాల సేవలను సమర్థవంతంగా వినియోగించుకొని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, మండల సర్వేయర్‌కు సూచించారు. రీసర్వే పనుల పురోగతిని జిల్లా యంత్రాంగం ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామస్థులు, రైతులతో మాట్లాడిన అదనపు కలెక్టర్, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూమార్చండి రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. భూముల కొలతలను కచ్చితత్వంతో చేపట్టి, సరిహద్దులను స్పష్టంగా గుర్తించేందుకు ఆధునిక రోవర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. రీసర్వే పూర్తయిన అనంతరం సంబంధిత భూయజమానులకు ల్యాండ్ పార్సెల్ మ్యాప్స్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల భూ సరిహద్దులు, రెవెన్యూ రికార్డులకు సంబంధించి భవిష్యత్తులో తలెత్తే వివాదాలను నివారించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. భూ రీసర్వే ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా, వేగవంతంగా పూర్తయ్యేలా గ్రామస్థులు, రైతులు అధికారులకు పూర్తి సహకారం అందించాలని అదనపు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

పర్వతగిరి వ్యవసాయ మార్కెట్ యార్డులో

సీసీ పనులు ప్రారంభం

- రైతులకు మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యం

(వరంగల్/పర్వతగిరి) అక్టోబర్ 14, ప్రజాకలం ప్రతినిధి: పర్వతగిరి వ్యవసాయ మార్కెట్ యార్డులో అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. మార్కెట్ యార్డులో రైతులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించి, రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే దిశగా సీసీ పనులు చేపట్టారు. మార్కెట్ యార్డులో సీసీ పనులు పూర్తయితే రైతులకు పంట ఉత్పత్తుల రవాణాలో సౌకర్యం కలగడంతో పాటు వర్షాకాలంలో బురద, ఇతర ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది. పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ పులి ప్రియాంక అనిల్, ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ గొడుగు భిక్షపతి, పర్వతగిరి పీఏసీఎస్ చైర్మన్ పిన్నింటి అనిల్ రావు, రమేష్, పోకల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై మెరుగు రాజుకు ఘన సత్కారం!

- వర్ధన్నపేటలో రెండున్నరేళ్ల సేవలకు అభినందనలు

- వంగర ఎస్సైగా బదిలీ



అక్టోబర్ 14 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్/వర్ధన్నపేట)
స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా రెండున్నరేళ్ల పాటు విధులు నిర్వహించి, హనుమకొండ జిల్లా వంగర పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్తున్న మెరుగు రాజును పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఎస్సైగా విధులు నిర్వహించిన సమయంలో మెరుగు రాజు ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేశారని నాయకులు పేర్కొన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిచ్చారని కొనియాడారు. వంగర పోలీస్‌స్టేషన్‌లోనూ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, ఐనవోలు ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, మండల యువజన అధ్యక్షుడు పత్రి భానుప్రసాద్, పీఏసీఎస్ డైరెక్టర్ కొండేటి మహేందర్, పదో డివిజన్ అధ్యక్షుడు కొండేటి బాలకృష్ణ, పులి శ్రీనివాస్, విలాసారపు వెంకట్‌గౌడ్, ఎస్‌కే షబ్బీర్, ఐత సుధాకర్, శివరాత్రి వెంకటనర్సు, తోటకూరి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అమరవాయిలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండ్ల శ్రీకారం!

మహిళా సమాఖ్య భవనం, వీధిదీపాలు ప్రారంభం



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 14 (ప్రజా కలం): జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం అమరవాయి గ్రామంలో నూతన మహిళా సమాఖ్య భవనాన్ని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో వీధిదీపాలను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తూమ్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్ రెడ్డి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతమై అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. మహిళా సంఘాల్లో సభ్యులుగా చేరి ప్రభుత్వం అందిస్తున్న వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా సమాఖ్య భవనం సంఘాల సమావేశాలకు, మహిళల అభ్యున్నతికి ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే మౌలిక సదుపాయాల కల్పన ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా కృషి చేస్తానని, గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిమ్మారెడ్డి, మాజీ ఎంపీపీ రాజారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వీరన్న, విక్రమ్ సింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఇతర నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండెపుడిలో ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

నాలుగో రోజు శ్రీ మహా చండి అవతారంలో దర్శనమిచ్చిన దుర్గామాత



మరిపెడ ప్రతినిధి ప్రజాకలం న్యూస్ అక్టోబర్ 14 : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గుండెపుడి గ్రామంలో భవాని యువజన సంఘం ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు దుర్గామాత శ్రీ మహా చండి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తూ అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత కసిరెడ్డి నరేష్ రెడ్డితో పాటు భవాని యువజన సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల నిర్వహణలో యువజన సంఘం సభ్యులు చురుకుగా పాల్గొంటున్నారు.

జమాల్ పురంలో కొత్త ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభం

- దాతృత్వం చాటిన స్థలదాతకు, కృషి చేసిన లైన్ మెన్ కు గ్రామ సర్పంచ్, ప్రజల అభినందనల వెల్లువ



(వరంగల్/ పర్వతగిరి) అక్టోబర్ 14, ప్రజాకలం ప్రతినిధి:
పర్వతగిరి మండల కేంద్రంలోని జమాల్ పురం గ్రామపంచాయతీ సోమారం రైతుల చిరకాల సమస్యకు పరిష్కారం లభించింది. జమాల్ పురం కుంబోడు వద్ద నూతన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జమాల్ పురం సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్, విద్యుత్ శాఖ ఏఈ పాల్గొని ప్రారంభించారు. ఈ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుకు తన స్థలాన్ని దానంగా ఇచ్చి గొప్ప మనసు చాటుకున్న కుమ్మజెల్ల రాంబాబు ని సర్పంచ్, లైన్ మెన్ ప్రత్యేకంగా అభినందించారు. రైతుల కోసం తన పొలంలో కొంత స్థలం ఇవ్వడం నిజంగా ఆదర్శనీయమని వారు అన్నారు. ఈ ట్రాన్స్ ఫార్మర్ మంజూరు అయ్యి, ఏర్పాటు అయ్యే వరకు ఎంతో కృషి చేసిన లైన్ మెన్ శోభన్ కుమార్, మట్టపల్లి అమృతరావు లను సర్పంచ్ అభినందించారు. వారి నిరంతర కృషి వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ నిర్మాణ కార్యక్రమంలో గోరేమియా, సందాని, సర్దార్, గౌస్ పాషా, రాము, మధుకర్, కాంట్రాక్టు నిర్మాణ కార్మికులు తమ శ్రమతో ఈ పనిని పూర్తి చేశారని, వేమునూరి సదానందం, యాకాచారి, సంపత్, హరీష్, కిషన్, రవి తదితరులు పెద్ద సంఖ్యలో రైతులు, గ్రామస్తులు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ట్రాన్స్ ఫార్మర్ తో జమాల్ పురంలో 15-20 ఎకరాలు, సోమారంలో 60-70 ఎకరాల వరి పంటకు విద్యుత్ అందుతుందని కష్టకాలంలో లో-వోల్టేజ్ సమస్య తీర్చిన ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు కి, ప్రభుత్వానికి, రైతులు అండగా ఉండాలని, ఇది ఒక స్ఫూర్తిదాయకమైన పని అని, స్థలదాతను, నిర్మాణానికి కృషి చేసిన వారిని, రైతులు ఆదర్శంగా తీసుకోవాలని సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ తెలిపారు.

ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలలో విద్యార్థులకు ఆహ్లాదకరమైన

వాతావరణంలో విద్యా బోధన సాగాలి



నిర్మల్ అక్టోబర్ 14 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)
జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను బుధవారం కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా ఆయన కళాశాల పరిసరాలను పరిశీలించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టి, కళాశాల ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కళాశాలకు సంబంధించి, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సంఖ్య అడిగి తెలుసుకున్నారు. ప్రణాళిక ప్రకారం విద్యా సంవత్సర సిలబస్ పూర్తి చేయాలన్నారు. నర్సింగ్ వృత్తి అంటే ప్రజలకు నిస్వార్థ సేవ అందించడమని, విద్యార్థుల్లో సేవా భావం పెంపొందించాలన్నారు. చదువు పూర్తి కాగానే వారు నర్సింగ్ వృత్తిలో స్థిరపడేలా తీర్చిదిద్దాలన్నారు. ప్రాక్టికల్ విద్యాబోధన మెరుగ్గా అందించేలా దృష్టి సారించాలని సూచించారు. కళాశాలలో పలు మాలిక వసతుల అవసరాన్ని అధికారులు కలెక్టర్ దృష్టికి తేగా.. స్పందించిన కలెక్టర్ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ మంజుల, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు సమాన అవకాశాలు కల్పించాలి

విద్య, ఆరోగ్యం, రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి - డీఎల్ఎస్ఏ కార్యదర్శి నిహారిక



నాగర్‌కర్నూల్, అక్టోబర్ 14(ప్రజాకలం) : బాలికలకు సమాన అవకాశాలు కల్పించి, నాణ్యమైన విద్యను అందిస్తూ వారిని భవిష్యత్తులో స్వయం సమృద్ధి గల పౌరులుగా తీర్చిదిద్దాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి నిహారిక అన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, నాగర్‌కర్నూల్ ఆధ్వర్యంలో బుధవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని జ్ఞానేశ్వర వాత్సల్య మందిరం చిల్డ్రన్ హోమ్‌లో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిహారిక బాలికల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న లింగ వివక్ష, బాల్య వివాహాలు, వివిధ రకాల అసమానతలపై సమాజంలో అవగాహన పెంపొందించడమే అంతర్జాతీయ బాలికల దినోత్సవం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. నేటికీ కొన్ని ప్రాంతాల్లో బాలికలకు చదువుకునే అవకాశాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి బాలికకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, వారు మధ్యలోనే చదువు మానేయకుండా తల్లిదండ్రులు, సమాజం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, హింసను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. బాలికలకు సరైన పోషకాహారం, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు వారి హక్కులను కాపాడాల్సిన బాధ్యత సమాజంపై ఉందని పేర్కొన్నారు. బాలికలకు విద్య, ఉద్యోగ, ఇతర రంగాల్లో సమాన అవకాశాలు కల్పించి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేలా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థి దశ జీవితంలో అత్యంత కీలకమైనదని, బాలికలందరూ కష్టపడి చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని నిహారిక ఆకాంక్షించారు. బాలికలకు ఏవైనా సమస్యలు ఎదురైనా లేదా సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య, చిల్డ్రన్ హోమ్ నిర్వాహకులు, చిన్నారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ భరోసా!

రూ.25 వేల ఆర్థిక సాయం మంజూరు

ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి చేతుల మీదుగా చెక్కు అందజేత

మాజీ వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు కృషికి ఫలితం



ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, అక్టోబర్ 14 :
ఆవదలో ఉన్న నిరుపేద కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలిచింది. ఎటపాక మండలం గౌరిదేవిపేట గ్రామానికి చెందిన, ప్రస్తుతం లక్ష్మీపురంలో నివాసముంటున్న గాదె శ్రీనివాసరావుకు రూ. 25 వేల ఆర్థిక సాయం మంజూరైంది. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ప్రత్యేక చొరవతో ఈ ఆర్థిక సాయం అందింది.
దొంతు మంగేశ్వరరావు చొరవతో ఆర్థిక సాయం
బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితిని గుర్తించిన మాజీ వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు ఈ విషయాన్ని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి దృష్టికి తీసుకెళ్లారు. బాధితుడికి ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం మంజూరయ్యేలా కృషి చేశారు. దీంతో గాదె శ్రీనివాసరావుకు రూ. 25 వేల ఆర్థిక సాయం లభించింది.
బాధితుడికి చెక్కు అందజేత
ఈ మేరకు బుధవారం రంపచోడవరంలోని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి బాధితుడు గాదె శ్రీనివాసరావుకు రూ. 25 వేల చెక్కును అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న సమయంలో ప్రభుత్వ సహాయం అందడం బాధిత కుటుంబానికి ఊరటనిచ్చింది. అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.
సీఎంకు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు... తనకు ఆర్థిక సాయం అందేలా కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవికి, మాజీ వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావుకు గాదె శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచేందుకు చొరవ చూపిన దొంతు మంగేశ్వరరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా పుల్లయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏకశిల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడికి ఎమ్మెల్యే నాగరాజు పరామర్శ



(వరంగల్/పర్వతగిరి) అక్టోబర్ 14, ప్రజాకలం ప్రతినిధి: పర్వతగిరి మండలం వొడ్లకొండ గ్రామానికి చెందిన ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నరకుడు రవీందర్ హన్మకొండలోని ఏకశిల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు, హన్మకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కే.ఆర్ దిలీప్ రాజ్ ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులను రవీందర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను సూచించారు. రవీందర్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ప్రజలకు, పార్టీ శ్రేణులకు అండగా ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడమే తన బాధ్యత అని ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి, కల్లెడ సొసైటీ చైర్మన్ పిన్నింటి అనిల్ రావు, చౌటపల్లి సొసైటీ చైర్మన్ పత్తి కుమారస్వామి, వడ్లకొండ కాంటెస్టెడ్ సర్పంచ్ అనిల్, మండల మహిళా ప్రెసిడెంట్ సువార్త, సొసైటీ డైరెక్టర్లు బొట్ల మహేంద్ర, అబర్ల రవి, నాయకులు చౌడ సుధాకర్, ప్రమోద్, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

పసివాడి వెండి కడియాలపై దొంగ కన్ను!

చోరీకి యత్నించిన వ్యక్తికి మహిళ దేహశుద్ధి..

గద్వాల బస్టాండ్‌లో కలకలం



గద్వాల, అక్టోబర్ 14 (ప్రజా కలం): గద్వాల బస్టాండ్‌లో బుధవారం మధ్యాహ్నం చిన్నారి కాళ్లకు ఉన్న వెండి కడియాలను దొంగిలించేందుకు ప్రయత్నించిన వ్యక్తిని కుటుంబ సభ్యురాలు పట్టుకుంది. అప్రమత్తమైన మహిళ అతడిని నిలదీసి చెప్పుతో కొట్టడంతో బస్టాండ్‌లో కొద్దిసేపు కలకలం నెలకొంది.బస్సు ఎక్కే సమయంలో చిన్నారి కాళ్లకు ఉన్న వెండి కడియాల్లో ఒకదాన్ని తీసిన వ్యక్తి, మరో కడియాన్ని కూడా దొంగిలించేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. దీనిని గమనించిన మహిళ వెంటనే అతడిని పట్టుకుంది. ఆ తర్వాత అతడిని చెప్పుతో కొట్టింది. అప్రమత్తమైన ప్రయాణికుల మధ్య నుంచి నిందితుడు తప్పించుకోలేకపోయాడు.మహిళ చాకచక్యంగా వ్యవహరించడంతో వెండి కడియం తిరిగి దక్కింది. ఈ ఘటనతో బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. బస్టాండ్‌లలో ప్రయాణించే సమయంలో తల్లిదండ్రులు తమ చిన్నారులు, విలువైన వస్తువుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఈ ఘటన గుర్తుచేస్తోంది.

గంగన్‌పల్లిలో యువకుడి అనుమానాస్పద మృతి

గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 14 (ప్రజా కలం): జోగులాంబ గద్వాల జిల్లా కేటిదొడ్డి మండలం గంగన్‌పల్లి గ్రామానికి చెందిన కుర్వ పెద్దప్ప కర్రెప్ప (30) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. వ్యవసాయ పొలంలోని ఓ చెట్టుకు ఉరివేసుకున్న స్థితిలో ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు.మృతుడు గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. యువకుడి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అయిజ కాంగ్రెస్‌లో కలకలం

ఏడుగురు కౌన్సిలర్లు రాజీనామా చేసినట్లు ప్రచారం!

గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 14 (ప్రజా కలం): జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏడుగురు కౌన్సిలర్లు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి వ్యవహారశైలిపై అసంతృప్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ నాయకులకు ప్రాధాన్యత ఇస్తున్నారనే అసంతృప్తితో కౌన్సిలర్లు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చర్చ జరుగుతోంది. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు రాజీనామా లేఖలు పంపినట్లు తెలుస్తోంది. అయితే ఏడుగురు కౌన్సిలర్ల రాజీనామాలపై అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది. రాజీనామా లేఖలు పార్టీ నాయకత్వానికి చేరాయా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఎలా స్పందిస్తుందో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



కుబీర్ మండల ప్రెస్ యూనియన్‌కు విలేకరుల రాజీనామా

యూనియన్ సభ్యుల తీరుపై అసంతృప్తి.. రాజీనామా చేసిన గఫూరొద్దీన్, ఖాజా మైనొద్దీన్

నిర్మల్ అక్టోబర్ 14 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) నిర్మల్ జిల్లా కుబీర్ మండల ప్రెస్ యూనియన్‌కు చెందిన పత్రికా విలేకరులు గఫూరొద్దీన్, ఖాజా మైనొద్దీన్ లు రాజీనామా చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్‌లోని కొందరు సభ్యుల వ్యవహారశైలి, వారి తీరు నచ్చకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. యూనియన్‌లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలోనే తాము రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు తమ రాజీనామా విషయాన్ని ప్రకటన ద్వారా తెలియజేశారు.

తాడిచర్ల పెద్దమ్మ తల్లి ఆలయంలో అంగరంగ వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రత్యేక పూజలు నిర్వహించిన తహసీల్దార్ కె. రవికుమార్...



మల్హర్, అక్టోబర్ 14 ప్రజాకలం ప్రతినిధి... మండల కేంద్రమైన తాడిచర్లలోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయంలో ముదిరాజ్ కులస్థుల ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు మహాచండి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మల్హర్ తహసీల్దార్ కె. రవికుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.అనంతరం భవానీ మాత స్వాములు నిర్వహించిన భజన కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మంగళహారతులు, భక్తుల ఆలాపనలతో పరిసరాలు మార్మోగాయి. ఉత్సవాల సందర్భంగా భక్తులకు భారీగా మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భవానీ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రియదర్శిని కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

ఆటపాటలతో సందడి చేసిన విద్యార్థినులు.. తెలంగాణ సంస్కృతిపై షీ టీం ఎస్ఐ రమాదేవి ప్రసంగం

ప్రజాకలం ప్రతినిధి కొత్తగూడెం , అక్టోబర్ 14 : స్థానిక బస్టాండ్ సమీపంలోని ప్రియదర్శిని డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులు పోటీవడి అందంగా, ఆకర్షణీయంగా బతుకమ్మలను తయారు చేశారు. అనంతరం బతుకమ్మ ఆటపాటలతో కళాశాల ప్రాంగణాన్ని సందడిగా మార్చారు. విద్యార్థినుల ఉత్సాహం, సంప్రదాయ పాటలతో కళాశాలలో పండుగ వాతావరణం నెలకొంది.



తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మకు ప్రత్యేక స్థానం

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన షీ టీం ఎస్ఐ రమాదేవి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మహిళలు, ప్రకృతి, పూలతో ముడిపడిన ఈ పండుగకు తెలంగాణ సంస్కృతిలో విశేష ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. విద్యార్థినులు సంప్రదాయ పండుగలను ఉత్సాహంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించిన కళాశాల యాజమాన్యం, అధ్యాపక సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు, డైరెక్టర్ శ్రీరామనేని చలపతిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ నయీం పాషా, వైస్ ప్రిన్సిపాల్ రాయల వివేక్, పీడీ కాశిమల్ల రమేష్‌తో పాటు అధ్యాపక సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన నారపోగు వెంకట్..



తల్లాడ అక్టోబర్ 13 ప్రజా కలం న్యూస్ ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నివాసంలో సీఎంని తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఢిల్లీలో జరిగిన నిరసన కార్యక్రమం విజయవంతం పట్ల ఆయన మంత్రులతో కలిసి సీఎంను కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మానుకొండూర్ ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర ఎస్సీ విభాగం చైర్మన్ కవంపల్లి సత్యనారాయణ, ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

తానూర్ కళాశాల భవనం, గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి ఎమ్మెల్యే వినతి

తానూర్, అక్టోబర్ 14(ప్రజా కలం): హైదరాబాద్ నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో డైరెక్టర్ అభిలాష అభినవ్‌ను ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. తానూర్ జూనియర్ కళాశాలకు నూతన భవనం మంజూరు చేయాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విద్యనందించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీని త్వరితగతిన నియమించాలని కోరారు, ఆధునిక సౌకర్యాలతో కళాశాల భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై బోర్డు డైరెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పట్టేపూర్ సతీష్ రెడ్డి పాల్గొన్నారు.



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మేఘన కాంతి ప్రియకు నాలుగు బంగారు పతకాలు

- తల్లిదండ్రులను ఘనంగా సన్మానించిన బీజేపీ నాయకులు



ప్రజాకలం ప్రతినిధి బూర్గంపహాడ్,అక్టోబర్ 14:

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ విద్యను విజయవంతంగా పూర్తి చేసి, నాలుగు బంగారు పతకాలు సాధించిన సారపాకకు చెందిన మేఘన కాంతి ప్రియకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులు తాటి రెడ్డి గోవిందరెడ్డి, ధనలక్ష్మి దంపతులను భారతీయ జనతా పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

నాలుగు బంగారు పతకాలతో జిల్లాకు గర్వకారణం

బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన గోవిందరెడ్డి, ధనలక్ష్మి దంపతుల కుమార్తె మేఘన కాంతి ప్రియ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ విద్యను అభ్యసించి విశేష ప్రతిభ కనబరిచారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, యూనివర్సిటీ ఉపకులపతి జె. అనురాధ చేతుల మీదుగా నాలుగు బంగారు పతకాలను అందుకున్నారు. ఆమె సాధించిన ఈ ఘనత పట్ల సారపాక, మొరంపల్లి బంజరతో పాటు బూర్గంపాడు మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. మేఘన నాలుగు బంగారు పతకాలు సాధించి విద్యారంగంలో ఉన్నత ప్రతిభను చాటుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. ఆమె తన విజయంతో కుటుంబానికే కాకుండా ప్రాంతానికి, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు. మేఘనను సరస్వతీ పుత్రికగా అభివర్ణిస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత విద్యను అభ్యసించి, సమాజానికి సేవ చేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

కుమార్తె విజయంపై తండ్రి హర్షం

మేఘన తండ్రి గోవిందరెడ్డి మాట్లాడుతూ.. తన కుమార్తె చిన్నప్పటి నుంచే చదువులో ప్రతిభ కనబరిచేదని తెలిపారు. ఆమెను ఉన్నత స్థాయిలో చూడాలనే ఆశయంతో సివిల్ సర్వీసెస్ సాధించి ప్రజలకు సేవ చేయాలని ప్రోత్సహించినట్లు చెప్పారు. అదే లక్ష్యంతో ముందుకు సాగుతూ కుమార్తె మంచి ఫలితాలు సాధించడం తమకు ఎంతో ఆనందాన్ని, సంతృప్తిని కలిగించిందన్నారు. ఆమె సాధించిన విజయాలు తమ కుటుంబానికి గర్వకారణమని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు మండల బీజేపీ అధ్యక్షుడు బి. సాయిశ్రీను, మండల ఇన్‌చార్జి ముసుగు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బాలు నాయక్, జిల్లా ఉపాధ్యక్షురాలు దివ్యశ్రీ, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రహీం, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చుక్కపల్లి బాలాజీ, కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, దుప్పటి సురేష్, మండల ప్రధాన కార్యదర్శులు వెలిశెట్టి రామారావు, దుర్గాల వెంకటేశ్వర్లు, బీఎంఎస్ నాయకులు వైవీ, ఓరుగంటి సురేష్, నంద్రు నాగబాబుతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మేఘన తల్లిదండ్రులను అభినందించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదును వేగవంతం చేయాలి

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బద్దం మహిపాల్ రెడ్డి

పాలేరు అక్టోబర్ 14(ప్రజాకలం న్యూస్)

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, ఖమ్మం జిల్లా పార్టీ ఇన్‌చార్జి బద్దం మహిపాల్ రెడ్డి సూచించారు. బుధవారం కూసుమంచి మండల కేంద్రంలో బీజేపీ జిల్లా నాయకుడు గుండా ఉపేందర్ రెడ్డి ఆహ్వానం మేరకు ఆయన స్వగృహానికి బద్దం మహిపాల్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రేఖ సత్యనారాయణ యాదవ్‌లు వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో సమావేశమై పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై చర్చించారు. ఈ సందర్భంగా బద్దం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొని తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ నాయకులు నిరంతరం కృషి చేయాలని సూచించారు.

పాత జాబితాలో పేరున్నా మళ్లీ నమోదు చేసుకోవాలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించి పాత ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు సైతం ఫారం-18 ద్వారా తిరిగి నమోదు చేసుకోవాలని, 2023



లేదా అంతకంటే ముందు డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని నాయకులు వివరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఓటు విలువైనదని, గతంలో మాదిరిగానే కొద్దిపాటి ఓట్ల తేడా కూడా ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రేఖ సత్యనారాయణ యాదవ్ మాట్లాడుతూ బీసీ ఓటర్లు అధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి వెళ్లి పట్టభద్రులకు ఫారం-18 అందించి, ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు చందబోయిన పుణ్యవతి, కొత్త శ్రీనివాస్ రెడ్డి, మంద నవ్య, మంద చంద్రశేఖర్ గౌడ్, సోమనపల్లి వెంకన్న, పిట్టల వేణు తదితరులు పాల్గొన్నారు.

తీరొక్క పూలతో అలంకరించి ఆరాధించే పండుగ బతుకమ్మ

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- ఉత్సాహభరితంగా కలెక్టరేట్ లో అట్ల బతుకమ్మ వేడుకలు
- కలెక్టరేట్ లో వివిధ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలలో పాల్గొని గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేసిన జిల్లా కలెక్టర్

ఖమ్మం, అక్టోబర్ 14(ప్రజా కలం న్యూస్)

తీరొక్క పూలతో అలంకరించి పూలను పూజించి, ప్రకృతిని ఆరాధించే తెలంగాణ ఆడబిడ్డల పూల పండుగ మన బతుకమ్మ అని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లో ఐదవ రోజు అట్ల బతుకమ్మ సందర్భంగా కలెక్టరేట్ లోని వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ బతుకమ్మ వేడుకలలో కలెక్టరేట్లోని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, ఉద్యానవన శాఖ, జిల్లా విద్యాశాఖ, ఇంటర్మీడియట్ విద్యాశాఖ, జిల్లా పరిశ్రమల శాఖ, జిల్లా పంచాయతీ శాఖ, జిల్లా పౌర సంబంధాల శాఖ, సహాయ సంచాలకులు (సర్వే మరియు భూ రికార్డులు), ఉపాధి శాఖ, ఖజానా శాఖ, ముఖ్య ప్రణాళికాధికారి కార్యాలయం, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయం, జిల్లా సరఫరాల శాఖ, ఎస్డీసి, ఎస్సీ కార్పొరేషన్, గనుల శాఖ, కార్మిక శాఖ, గృహ నిర్మాణ శాఖ, పట్టణ ప్రణాళిక శాఖ తదితర అన్ని శాఖల మహిళా అధికారులు, మహిళా సిబ్బంది అంతా కలిసికట్టుగా పాల్గొన్నారు. ముందుగా గౌరమ్మ తల్లికి పసుపు, కుంకుమ, పూలతో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పూజించారు. అమ్మవారికి కొబ్బరికాయ, ప్రసాదాలు సమర్పించి, జిల్లా సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు.

కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ బతుకమ్మ ఆట పాటలతో సందడి చేసిన మహిళలు, ఉద్యోగులను కలెక్టర్ ఉత్తేజపరిచారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించుకుంటున్న బతుకమ్మ పండుగలో తొమ్మిది రోజులు రకరకాలుగా గౌరమ్మను కొలుచుకొంటూ, కలిసి కట్టుగా అందరూ ఒకేచోట చేరి ఆడుతూ, పాడుతూ బతుకమ్మను పూజించుకొంటారని కలెక్టర్ అన్నారు.

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఐడీఓసీ ప్రాంగణంలో వివిధ రకాల రంగురంగుల పుష్పాలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. పూలతో ఆకర్షణీయంగా అలంకరించిన బతుకమ్మలు వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. మహిళా ఉద్యోగులు భక్తిశ్రద్ధలతో బతుకమ్మకు పూజలు నిర్వహించి, పూలు సమర్పిస్తూ సంప్రదాయాలను పాటించారు.

ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మల చుట్టూ చేరి ఉత్సాహంగా ఆడిపాడారు. తెలంగాణ ఆడపడుచుల ఐక్యత, ఆత్మీయత, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా వేడుకలు కొనసాగాయి. వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. పూల అలంకరణలు, సంప్రదాయ పాటలు, ఆటపాటలతో కలెక్టర్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.

ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అందరూ బతుకమ్మ సంబరాలలో పాల్గొని గౌరమ్మను కొలిచి ఆట, పాటలతో సందడి చేసారు.

ఖో ఖో రాష్ట్రస్థాయి పోటీలకు తరలిన నాగర్‌కర్నూల్ జిల్లా క్రీడాకారులు

ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపిక కావాలి: జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రమేష్



నాగర్‌కర్నూల్, అక్టోబర్ 14 (ప్రజాకలం) : 45వ జూనియర్స్ రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీల్లో పాల్గొనేందుకు నాగర్ కర్నూల్ జిల్లా పరిషత్ మైదానంలో జిల్లా ఖో ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు శీర్నం నిరంజన్ యాదవ్ అధ్యక్షతన బాల బాలికల జట్ల ఎంపిక నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు హైదరాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలోని ఖో ఖో మైదానంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఖో ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సామ రమేష్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జరిగే 45వ జూనియర్స్ బాలబాలికల ఖో ఖో పోటీల్లో క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని సూచించారు. పోటీల్లో గెలుపొంది జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణయ్య, జెట్టి లక్ష్మి, కార్యవర్గ సభ్యులు యాదయ్య, మామిళ్ళపల్లి రవికుమార్, రాఘవులు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు రమేష్, వెంకటేష్, రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు

షర్మిల,నవీన్ ల వివాహ వేడుకకు హాజరై అక్షింతలు వేసి దీవెనలు

హైదరాబాదులో ఘనంగా జరిగిన షర్మిల,నవీన్ ల వివాహ వేడుక

తల్లాడ అక్టోబర్ 14, ప్రజా కలం న్యూస్ తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు అన్నారుగూడెం గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ అన్నయ్య కూతురు గొడ్ల రవి నాగేంద్ర దంపతుల ప్రథమ కుమార్తె వివాహ వేడుకకు బుధవారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. షర్మిల వివాహం రంగారెడ్డి జిల్లాకు చెందిన నవీన్‌తో బుధవారం కందుకూరు మండలంలోని టంకం రామ్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల సమక్షంలో వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు నూతన వధూవరులు షర్మిల,నవీన్‌లకు అక్షింతలు వేసి,వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి,వివాహ వేడుకలో పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో అన్నారుగూడెం గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్,ఉపసర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు,వార్డు సభ్యులు సూదా హనుమంతరావు, సర్పంచ్ సతీమణి జ్యోతి,నాయకులు మారెళ్ల దేవేందర్,గొడ్ల సాల్మన్,ప్రసన్న కుమార్,రంజిత్ కుమార్ తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

డాక్టర్ రాజేశ్వర్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్



తానూర్, అక్టోబర్ 14 (ప్రజా కలం):మండల కేంద్రమైన తానూర్ గ్రామానికి చెందిన డాక్టర్ రాజేశ్వర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా, బుధవారం ముధోల్ మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పటేల్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంకర్ చంద్రే, పుండలిక్, చంద్రకాంత్ యాదవ్, గోవింద్ పటేల్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

కపాస్ కిసాన్ పథకం కింద పత్తి రైతులకు శిక్షణ

పాలేరు, అక్టోబర్ 14(ప్రజా కలం న్యూస్) కూసుమంచి మండలంలోని మునిగేపల్లి, కిష్టాపురం గ్రామాలలో రైతులకు పత్తి పంటలో చీడపీడలు, తెగుళ్ల నివారణపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం వైరా శాస్త్రవేత్తలు డాక్టర్ పావని, డాక్టర్ ఫణిశ్రీ పాల్గొని రైతులకు పత్తి పంటలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు .ఈ సందర్భంగా వారు పత్తి పంటలో ప్రధానంగా వచ్చే చీడపీడలు, తెగుళ్లను గుర్తించడం, వాటి నివారణ, సమగ్ర సస్యరక్షణ చర్యలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పత్తి పంటలో చీడపీడలు, తెగుళ్లను ప్రారంభ దశలోనే గుర్తించి, శాస్త్రీయ పద్ధతుల్లో నియంత్రణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. అవసరానికి అనుగుణంగా సిఫారసు చేసిన మందులను మాత్రమే వినియోగించాలని, పంటలో పురుగు మందుల వాడకంలో తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రస్తుతం గులాబీ రంగు పురుగు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించాలని తెలిపారు. అనంతరం పత్తి పంటను సందర్శించి, రైతులకు ప్రతి పంటలో వినియోగించే మొక్క పెరుగుదల నియంత్రకాలు సబ్సిడీలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త పావని, ఫణి శ్రీ, కిష్టాపురం గ్రామ సర్పంచ్ సైదులు, మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, ఏఈఓ రవీందర్, జానీ బాబా, రైతులు పాల్గొన్నారు.





మానవ సేవయే మాధవ సేవ:ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) 130 – సుభాష్ నగర్ కి చెందిన డాక్టర్ నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్సు సేవను ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ బుధవారం ప్రారంభించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... అత్యవసర సమయంలో ఆపదలో ఉన్న నిరుపేదలకు అంబులెన్స్ సర్వీస్ అందిస్తూ డాక్టర్ నరేందర్ గౌడ్ చేస్తున్న సేవలు అభినందనీయమని, అభాగ్యులకు, నిరుపేదలకు చేసే సేవ మాధవ సేవతో సమానమన్నారు.ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ ప్రెసిడెంట్ పోలె శ్రీకాంత్, సుభాష్ నగర్ వాసులు లోచారం వెంకటరమణ, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మినారాయణ, అడపా శేషు, విష్ణువర్ధన్, శివతేజ, గుబ్బల తేజ, పాల్గొన్నారు.

15 ఏళ్ల విద్యుత్ సమస్యకు పరిష్కారం

ప్రజలకు అందుబాటులో ఉండటమే లక్ష్యం : సర్పంచ్ జగన్మోహన్‌రెడ్డి

మహేశ్వరం, అక్టోబరు 14 (ప్రజాకలం): మహేశ్వరం మండలం పెండ్యాల గ్రామంలో 15 ఏళ్లుగా కొనసాగుతున్న విద్యుత్ సమస్యకు గ్రామ సర్పంచ్ జైత్వారం జగన్మోహన్‌రెడ్డి పరిష్కారం చూపించారు. విద్యుత్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్థుల కోసం బుధవారం కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, విద్యుత్ తీగలు బిగించడంతో సమస్య పరిష్కారమైంది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గతంలో తాను ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు పూర్తిస్థాయిలో



పనిచేయకపోవడంతో సమస్య తలెత్తిందన్నారు. తిరిగి సర్పంచ్‌గా ఎన్నికైన అనంతరం సమస్యను గుర్తించి కొత్త స్తంభాలు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయించి పరిష్కరించినట్లు తెలిపారు. గ్రామస్థుల సహకారంతో పెండ్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, గ్రామంలో ఎవరికి ఏ సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మంత్రి అనసూయ, వార్డు సభ్యులు మంత్రి జంగయ్య, మంత్రి విజయ, మంత్రి నరసింహ, మంగలి బాలకృష్ణ, యాచారం జంగయ్య, గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిసిన డీసీసీ అధ్యక్షురాలు పారిజాత

మహేశ్వరం, అక్టోబరు 14 (ప్రజాకలం): ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర నాయకులతో కలిసి ఖర్గే నివాసంలో నిర్వహించిన ప్రత్యేక తేనీటి విందు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ




సందర్భంగా తెలంగాణలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. రంగారెడ్డి జిల్లాలో పార్టీ బలోపేతానికి తాను చేస్తున్న కృషిని ఖర్గేకు వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఖర్గే సూచించినట్లు పారిజాత తెలిపారు. పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించినట్లు పేర్కొన్నారు.

పాములపర్తిలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గజ్వేల్ నియోజకవర్గం, అక్టోబర్ 14 (ప్రజా కలం ప్రతినిధి):

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం మర్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన చిన్నబోయిన పోచమ్మ (65) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ పాండుగౌడ్, మాజీ జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం, బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు మ్యాకల కనకయ్య,స్థానిక సర్పంచ్ భవాని బాలకిషన్,ఉప సర్పంచ్ సుధాకర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన వారు,వారికి అండగా నిలుస్తూ ఆర్థిక సాయం అందజేశారు.కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీను,కర్ణాకర్,గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు మహేష్,బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



24 డివిజన్ల పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ నూతన కమిటీలు



ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ సమన్వయ కమిటీకి అనుసంధానంగా, సీఎం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ రివైవల్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 24 డివిజన్లకు నూతనంగా ఏర్పాటు చేసిన పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ కమిటీల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి అతిథులుగా తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు కె.దీపక్ జాన్, మహబూబ్‌నగర్-- రంగారెడ్డి--హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి, తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రభుత్వ సమన్వయకర్త కల్లోజి రవికుమార్ హాజరైయ్యారు.ఈసందర్భంగా ముఖ్య అతిథులు నూతన కమిటీల సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవ మత పెద్దలు, పాస్టర్లు సమాజంలో ఐక్యత, సేవాభావం, శాంతి సోదరభావం పెంపొందించడంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్రజా సేవా కార్యక్రమాల్లో, సమాజ సంక్షేమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.ఈకార్యక్రమంలో సీఎం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ రివైవల్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ చైర్మన్, అధ్యక్షులు రెవరెండ్ డాక్టర్ గోడి శేఖర్, కార్యదర్శి బిషప్ ఎం.ఎస్. సామ్యూల్ పీటర్, కోశాధికారి రెవరెండ్ దయానిధి, ఉపాధ్యక్షులు ఆనంద్ బాబు, సంయుక్త కార్యదర్శి సి.హెచ్. బెల్తాజర్ రాజు, న్యాయ సలహాదారు డాక్టర్ ప్రదీప్ శ్యామ్, నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాస్టర్ జి.రాజశేఖర్ నియోజకవర్గంలోని 24 డివిజన్ల నూతన ఫెలోషిప్ కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, DCC కమిటీ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పాస్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

కుత్బుల్లాపూర్, అక్టోబరు 14 (ప్రజాకలం): కుత్బుల్లాపూర్ జోనల్ పరిధిలో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజన తెలిపారు. బుధవారం కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌తో కలిసి జీడిమెట్ల సర్కిల్-55 పరిధిలో పలు ప్రాంతాల్లో చేపట్టనున్న పౌర మౌలిక సదుపాయాల పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

చౌరస్తా అభివృద్ధిపై దృష్టి: కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయం సమీపంలోని చౌరస్తాలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో చేపట్టనున్న కూడలి అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

పార్కు అభివృద్ధి: గాయత్రినగర్ మూడో దశలోని పార్కు సముదాయాన్ని వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పార్కులో అదనపు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

క్రీడా మైదానం ఏర్పాటు: గాయత్రినగర్ వార్డు కార్యాలయం సమీపంలో ప్రతిపాదించిన క్రీడా మైదానాన్ని కమిషనర్ పరిశీలించి ప్రణాళికపై అధికారులతో చర్చించారు. సంస్థల సామాజిక బాధ్యత నిధులతో క్రీడా మైదానంలో వాలీబాల్ కోర్టు ఏర్పాటు, మొక్కలు నాటడం, పచ్చదనం పెంపొందించడం, వివిధ క్రీడలకు అవసరమైన వసతులు కల్పించడం, నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతిపాదిత పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని, క్షేత్రస్థాయిలో సకాలంలో తదుపరి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల సర్కిల్ ఉప కమిషనర్ డి. శంకర్‌సింగ్, భద్రునాయక్, కార్యనిర్వహణ ఇంజినీర్ సురేందర్‌రెడ్డి, సహాయ పోలీసు కమిషనర్ పి. ఉదయ్‌కుమార్, ఏఎంసీ మహేందర్, ఉద్యానవన విభాగం నిర్వాహకుడు దుర్గాప్రసాద్, ఉప కార్యనిర్వహణ ఇంజినీర్లు శివప్రకాష్, సాయి, నికితాసేన్, సహాయ కార్యనిర్వహణ ఇంజినీర్ బి.ఆర్. చేతన్, క్రీడా శిక్షకుడు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ సూర్యవంశ ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ఉత్సవాలు

- 25 ఏళ్లుగా భక్తిశ్రద్ధలతో ఉత్సవాల నిర్వహణ

నిర్వాహకులను అభినందించిన ప్రముఖులు



గజ్వేల్, అక్టోబర్ 14 (ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని సమీకృత మార్కెట్ ఆవరణలో శ్రీ సూర్యవంశ ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.ఇందులో భాగంగా బుధవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్కర్ పద్మాబాయి నర్సింగరావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ధూప,దీప, నైవేద్యాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం మహిళలు నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.ఈ కార్యక్రమానికి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్,కౌన్సిలర్లు గుంటుకు లక్ష్మి శ్రీనివాస్,రొట్టెల శ్రీనివాస్,కవ్వ మమతా పోచయ్య,భాగ్యలక్ష్మి,కొలిచెలిమి భవాని,మన్నె రూప వెంకటేష్,గోలి మమత సంతోష్,సిఐ రవికుమార్, లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ కొలిచెలిమి స్వామి,గజ్వేల్ జడ్జి స్వాతి గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ శ్రీ సూర్యవంశ ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో గత 25 సంవత్సరాలుగా దేవి నవరాత్రి ఉత్సవాలను నిరంతరాయంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతోపాటు సమాజంలో ఐక్యత,సోదరభావాలను బలోపేతం చేస్తాయని అన్నారు.అమ్మవారి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని,సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పుష్కలంగా పండాలని, తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఆర్కే శ్రీనివాస్,ఎర్రవాడ బాలకృష్ణ,తాళ్ల నాగరాజు,శ్రీ సూర్యవంశ ఆరెకటిక సంఘం నాయకులు,మహిళలు,చిన్నారులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.



పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి భారీ మెజార్టీతో గెలిపించాలి

: మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) షాపూర్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంతో పాటు ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి అతిథిగా హాజరైయ్యారు. ఈసందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డికి మద్దతుగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. నవంబర్ 6 ఓటరు నమోదు చివరి తేదీ కావడంతో నియోజకవర్గంలోని 24 డివిజన్లలో అర్హులైన పట్టభద్రులంతా తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం సామ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... ఒక యువకుడినైనా తనకు అభ్యర్థిగా అవకాశం కల్పించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు సూచించారు, కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో సుమారు 30వేల పట్టభద్రుల ఓట్లు ఉన్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరు ఓటును నమోదు చేస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తన విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు, మహిళలు, పట్టభద్రులు పాల్గొన్నారు.

కేఎల్ఆర్, ఏనుగు జంగారెడ్డి సహకారంతో విద్యుత్ సమస్యకు పరిష్కారం

దెబ్బలగూడ సర్పంచ్ మల్లెపల్లి బాల్‌రాజ్ కృతజ్ఞతలు

కందుకూరు, అక్టోబరు 14 (ప్రజాకలం): మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం దెబ్బలగూడ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వోల్టేజీ సమస్య ఏర్పడి రైతులు తీవ్ర



ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామ సర్పంచ్ మల్లెపల్లి బాల్‌రాజ్ గుర్తించారు. సమస్యను మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై వెంటనే స్పందించిన ఏనుగు జంగారెడ్డి.. కిచ్చన్నగారి లక్ష్మారెడ్డితో మాట్లాడి వారి సహకారంతో విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం పరిష్కరించినట్లు సర్పంచ్ తెలిపారు. తక్కువ వోల్టేజీ సమస్యను అధిగమించేందుకు గ్రామంలో ఉన్న విద్యుత్ పరివర్తకాన్ని మార్చడంతో పాటు మహమ్మద్‌నగర్‌లో కొత్తగా మరో విద్యుత్ పరివర్తకాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి సహకరించిన కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, ఏనుగు జంగారెడ్డికి సర్పంచ్ మల్లెపల్లి బాల్‌రాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి భవిష్యత్తులోనూ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చెంచు అంజమ్మ, వార్డు సభ్యులు శారద, నాయకులు అనిల్, జంగయ్య, శేఖర్‌రెడ్డి, సామా వెంకట్‌రెడ్డి, కళ్లెం ప్రకాష్‌రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



తొలగించిన చోటే అంబేడ్కర్ విగ్రహం పునఃప్రతిష్ఠ. జీవో 18ను రద్దు చేయాలి.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ జిల్లా సభ్యుడు పి. శంకర్.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 14: అనుమతుల పేరుతో తొలగించిన డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహాన్ని అదే స్థలంలో దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పునఃప్రతిష్ఠించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సిద్దిపేట జిల్లా సభ్యుడు, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ అన్నారు. దౌల్తాబాద్ మండలం ముత్యంపేట గ్రామంలో బౌద్ధ ఆచారం ప్రకారం విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించిన అనంతరం ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ కులమతాలకు అతీతంగా దేశ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించేందుకు, సామాజిక న్యాయం కోసం జీవితాంతం కృషి చేశారని గుర్తుచేశారు. అలాంటి మహనీయుడి విగ్రహాన్ని అనుమతుల పేరుతో తొలగించడం బాధాకరమన్నారు. గ్రామ పంచాయతీ ఎదుట అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వల్ల పంచాయతీ గౌరవం పెరుగుతుందని పేర్కొన్నారు. దేశ పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ ప్రాంగణాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు ఉన్న ప్రాధాన్యతను అధికారులు గుర్తించాలని సూచించారు. అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటులో వివక్ష చూపకూడదని, విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి అమలులో ఉన్న జీవో 18ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 14న అంబేడ్కర్ బౌద్ధం స్వీకరించిన రోజును పురస్కరించుకుని విగ్రహ పునఃప్రతిష్ఠ చేపట్టినట్లు తెలిపారు. మరోసారి అంబేడ్కర్ విగ్రహాలను తొలగించే చర్యలకు అధికారులు, పోలీసులు పాల్పడితే సహించ బోమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల నర్సింలు, ఎమ్మార్పీఎస్ రాయపోల్ మండల అధ్యక్షుడు అయ్యగల్ల రవి, మాల మహానాడు దౌల్తాబాద్, రాయపోల్ మండలాల అధ్యక్షులు బొల్లం రాజేష్, సోక్కం స్వామి, నాయకులు గజ్వేల్ రామచంద్రం, పుట్ట రాజు, ఉషనగల శ్రీనివాస్, వెంకటేష్, శ్రీకాంత్, పరశురాములు, కరుణాకర్, ప్రవీణ్, మహేష్, స్వామి, ప్రశాంత్, నర్సింలు, రాజయ్య, దుర్గయ్య, మీన, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీగా గుజ్జ సత్యంకు అవకాశం ఇవ్వాలి

- పద్మశాలి మహాజన సంఘం తీర్మానం

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 14 (ప్రజా కలం) బీసీ హక్కుల సాధనతో పాటు విద్యా, వైద్య, సామాజిక సేవలు, చేనేత రంగాల్లో గుజ్జ సత్యనారాయణ అందిస్తున్న సేవలను గుర్తించి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కల్పించాలని భూదాన్ పోచంపల్లి పద్మశాలి మహాజన సంఘం తీర్మానం చేసింది. ఈ మేరకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు మాట్లాడుతూ బీసీల హక్కులు, సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం కృషి చేస్తున్న గుజ్జ సత్యం సేవలను గుర్తించి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గుజ్జ సత్యంకు ఎమ్మెల్సీ పదవి కల్పించే అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. గుజ్జ సత్యం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా, బీసీ జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. బీసీ రిజర్వేషన్లు, కులగణనలో న్యాయం, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కోసం పోరాడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి బ్యాంకు మాజీ చైర్మన్ చిట్టిపోలు శ్రీనివాస్, పద్మశాలి చేనేత సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్, కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, మహాజన సంఘం ఉపాధ్యక్షుడు భోగ నరసింహ, ప్రధాన కార్యదర్శి భరత బాలరత్నం, సహాయ కార్యదర్శి కడవేరు చంద్రమౌళి, కోశాధికారి సంఘం చంద్రయ్య, సభ్యులు గంజి అంజయ్య, గుండు పాండు, కర్నాటి అంజమ్మ, గౌరవ సలహాదారు తడక యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఇద్దరికి రూ.25 వేల జరిమానా

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక

బీబీనగర్,అక్టోబరు 14 (ప్రజాకలం): మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు భువనగిరి న్యాయస్థానం భారీ జరిమానా విధించింది. బీబీనగర్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరిని బుధవారం భువనగిరిలోని స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ న్యాయస్థానంలో హాజరుపరిచారు. విచారణ అనంతరం బాలాపూర్‌కు చెందిన అనిల్ కుమార్‌కు రూ. 10 వేలు, పోచంవల్లి మండలం భీమనవల్లికి చెందిన బుర్గుదాసుకు రూ. 15 వేల జరిమానా విధించింది. ఈ సందర్భంగా సీఐ సూర్యనాయక్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని సీఐ హెచ్చరించారు.



సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలి :సీఐటీయూ

బీబీనగర్ అక్టోబర్ 14 (ప్రజాకలం): ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బండారు శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో వెంకిర్యాల, రాఘవాపురం, మగ్దంపల్లి గ్రామాల్లో పంచాయతీ కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారమని పేర్కొన్నారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను తొలగించడం సరికాదన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియతో అర్హులైన పేదలు, కార్మికులు, రైతులు, దళితులు, మైనారిటీలు, మహిళలు, వలస జీవుల ఓటు హక్కుకు నష్టం కలగకుండా చూడాలని కోరారు. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన అర్హుల పేర్లను తిరిగి చేర్చాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవద్దని అన్నారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకుడు బండారు శ్రీరాములు, సమన్వయ కమిటీ కన్వీనర్ సిల్వర్ రమేష్, నాశబోయిన నరసింహ, ఎడ్ల పద్మ, మంద యాదగిరి, మేకల బాబు, ఉప్పల రాణి, బుర్గుపల్లి సుజాత, మైసమ్మ, కషపాక ఇందిరమ్మ, యాకారి లింగం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.




మైక్రోఫైనాన్స్‌కు మళ్లీ జోష్

- 2026--27లో 10-15% వృద్ధి అంచనా

- గ్రామీణ జీవనోపాధులు, చిన్న వ్యాపారాలకు పెరుగుతున్న రుణ డిమాండ్

-వడ్డీ రేట్లలో మార్పు ఉండదు.. రెపో పెంపు భారాన్ని సంస్థలే భరిస్తాయి



హైదరాబాద్, అక్టోబర్ 14 (ప్రజా కలం ప్రతినిధి) దేశంలోని సూక్ష్మ రుణ (మైక్రోఫైనాన్స్) రంగం మళ్లీ వృద్ధి బాట పడుతోంది. 2026--27 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఈ రంగం 10--15 శాతం వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో, నాలుగో త్రైమాసికాల్లో వృద్ధి 15 శాతాన్ని మించే అవకాశం ఉందని సా-ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 21వ వార్షిక సదస్సులో పాల్గొన్న సూక్ష్మ రుణ సంస్థల ప్రతినిధులు వెల్లడించారు.గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి అవకాశాలు పెరగడం, చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యకలాపాలు విస్తరించడంతో సూక్ష్మ రుణాలకు డిమాండ్ పెరుగుతోందని తెలిపారు. రుణ వడ్డీ రేట్లలో ప్రస్తుతానికి మార్పులు ఉండవని, రెపో రేటు పెంపుతో ఏర్పడే అదనపు భారాన్ని మైక్రోఫైనాన్స్ సంస్థలే భరిస్తాయని పేర్కొన్నారు.

మహిళలకే అధిక రుణాలు

మైక్రోఫైనాన్స్ రుణాల్లో దాదాపు 90 శాతం మహిళా రుణగ్రహీతలకే అందుతున్నాయని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ సీఈఓ వి. వైద్యనాథన్ తెలిపారు. అగరబత్తీలు, చెప్పులు, పాపడ్ల తయారీ, పాడి పరిశ్రమ వంటి స్వయం ఉపాధి కార్యకలాపాలకు ఈ రుణాలను వినియోగిస్తున్నారని చెప్పారు. రుణగ్రహీతల్లో సగానికి పైగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి జారీ చేసిన కార్డులు కలిగినవారేనని పేర్కొన్నారు.

సాంకేతిక వినియోగంతో రుణాల పంపిణీ, వసూళ్లలో పారదర్శకత, ఉత్పాదకత పెరుగుతున్నాయని తెలిపారు. రుణ మొత్తాలను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం, యూపీఐ ఆటోపే ద్వారా వాయిదాలను వసూలు చేయడం వంటి విధానాలు రుణ వ్యవస్థపై విశ్వాసాన్ని పెంచుతున్నాయని వివరించారు. స్వీయ నియంత్రణ, రక్షణ చర్యలు అమల్లో ఉన్నందున మైక్రోఫైనాన్స్ రంగం భవిష్యత్తులో రుణ పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించుకునే సామర్థ్యం కలిగి ఉందన్నారు.

రూ.75 వేలకు చేరిన సగటు రుణం

గతంలో సగటున రూ. 50 వేలుగా ఉన్న సూక్ష్మ రుణ మొత్తం ప్రస్తుతం రూ. 75 వేల స్థాయికి చేరువైందని ఈఎస్ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఎండీ, సీఈఓ, సా-ధన్ చైర్మన్ డాక్టర్ కె. పాల్ థామస్ తెలిపారు. రుణాలను కేవలం వినియోగ అవసరాలకు కాకుండా జీవనోపాధి మెరుగుదల, ఆదాయ మార్గాల విస్తరణ, కొత్త ఉపాధి అవకాశాల కోసం వినియోగిస్తున్నారని చెప్పారు.గత రెండేళ్లలో రంగం పలు ఒత్తిళ్లను ఎదుర్కొన్నప్పటికీ వాటిని తట్టుకుని మరింత బలంగా నిలిచిందన్నారు. ఇందుకు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది కృషి ప్రధాన కారణమని పేర్కొన్నారు. మైక్రోఫైనాన్స్ రంగంలో స్వీయ నియంత్రణ వ్యవస్థ సమర్థంగా పనిచేస్తోందని తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారతకు ఊతం

మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యుల్లో 50 శాతానికి పైగా మహిళలకు ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశించడానికి మైక్రోఫైనాన్స్ తొలి మార్గంగా నిలుస్తోందని నాబార్డ్ చైర్మన్ డాక్టర్ షాజీ కృష్ణన్ వి. అన్నారు. అనంతరం వారిలో పలువురు వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరించడమే నాబార్డ్ లక్ష్యమన్నారు. సహకార బ్యాంకుల సేవలను మెరుగుపరిచేందుకు సాంకేతిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఖాతాలో జరిగే ప్రతి లావాదేవీ సమాచారాన్ని ఎస్ఎంఎస్, వాట్సాప్ ద్వారా ఖాతాదారులకు చేరవేసే సదుపాయాన్ని కల్పించినట్లు తెలిపారు.

'ఆగ్రిస్టాక్'తో మరింత ప్రయోజనం

మైక్రోఫైనాన్స్ రంగం 'ఆగ్రిస్టాక్' వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని షాజీ కృష్ణన్ సూచించా రు. వ్యక్తిగత గుర్తింపును వెల్లడించని విధంగా అందుబాటులో ఉండే విస్తృత సమాచారం ద్వారా గ్రామీణ ప్రాంతాల పరిస్థితులను లోతుగా విశ్లేషించవచ్చున్నారు. దీంతో రుణాల మంజూరుకు అయ్యే అంచనా వ్యయాన్ని తగ్గించడంతోపాటు వాతావరణ మార్పులకు అనుగుణంగా ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉంటుందని చెప్పారు. గ్రామీణ అవసరాలకు తగిన పరిష్కారాలను రూపొందించేందుకు ఫిన్‌టెక్ సంస్థలకు కూడా ఇది ఉపయోగపడుతుందన్నారు.

యువత లో వ్యాపార వేత్తలను ప్రోత్సహించడంపై నాబార్డ్ దృష్టి సారించిందని తెలిపారు. గ్రామీణ రుణ సదుపాయాల్లోకి ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించడం ద్వారా ప్రభుత్వం కూడా రంగానికి అండగా నిలుస్తోందన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో మైక్రోఫైనాన్స్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

98% వాటా సంస్థల సమాచారం

సదస్సులో 'భారత్ మైక్రోఫైనాన్స్' నివేదికను విడుదల చేశారు. క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలు, సూక్ష్మ రుణ సంస్థలు, నాబార్డ్, ఇతర భాగస్వామ్య సంస్థల నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి ఈ నివేదికను రూపొందించారు. దేశంలోని సూక్ష్మ రుణ వ్యాపారంలో 98 శాతానికి పైగా వాటాకు ప్రాతినిధ్యం వహించే 178 సంస్థలు తమ సమాచారాన్ని నివేదిక కోసం అందించాయి.

రుణ క్రమశిక్షణకు ప్రాధాన్యం

2025--26 ఆర్థిక సంవత్సరం రుణ పోర్ట్‌ఫోలియోను పటిష్ఠం చేసుకోవడం, రుణగ్రహీతలపై భారాన్ని నియంత్రించడం, వసూళ్లను మెరుగుపరచడం, స్థిరమైన రుణ వృద్ధిని పునరుద్ధరించడంపై దృష్టి పెట్టిన కాలంగా సా-ధన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ జీజీ మమ్మెన్ అభివర్ణించారు.

2026 ఏప్రిల్‌లో పరిశ్రమ ప్రముఖులు, స్వీయ నియంత్రణ సంస్థలు జారీ చేసిన మూడో విడత మార్గదర్శకాలు రుణాల మంజూరులో క్రమశిక్షణను మరింత బలోపేతం చేశాయని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మైక్రోఫైనాన్స్ రంగం భవిష్యత్తు వృద్ధిపై అంచనాలు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.


ఘోష్‌కు సత్కారం

గ్రామీణ ప్రజలకు అధికారిక రుణ సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడంలో విశేష కృషి చేసిన బంధన్ గ్రూప్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ చంద్రశేఖర్ ఘోష్‌ను సదస్సులో సత్కరించారు. 2001లో వడ్డీ వ్యాపారి వద్ద రుణం తీసుకుని బంధన్‌ను ప్రారంభించిన ఆయన.. తొలుత ఎన్‌జీవోగా, అనంతరం సూక్ష్మ రుణ సంస్థగా, చివరకు సార్వత్రిక బ్యాంకుగా సంస్థను అభివృద్ధి చేశారు. మహిళలకు ఆదాయాన్ని ఆర్జించే అవకాశాలు కల్పించడం, రుణాల మంజూరు, పంపిణీలో క్రమశిక్షణ పాటించడం, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ, బీమా సదుపాయాలతో ఆర్థిక రక్షణ కల్పించడం, ఐటీని వినియోగించడం వంటి అంశాలు బంధన్ అభివృద్ధికి దోహదపడ్డాయని ఘోష్ తెలిపారు.

అర్హులకు మొండిచేయి.. ఇళ్ల కేటాయింపుల్లో ఇష్టారాజ్యం

మహదేవపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలు

బీబీనగర్,అక్టోబరు 14 (ప్రజాకలం): ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బీబీనగర్ మండలం మహాదేవపూర్ గ్రామంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ దేవరకొండ వేణుగోపాల్ మాట్లాడుతూ.. నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేసే విషయంలో రాజకీయాలకు తావులేకుండా నిజమైన అర్హులను గుర్తించాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, ఇప్పటికే మొదటి విడతలో ఇళ్లు పొందిన కుటుంబాలకు చెందిన వ్యక్తులకు మళ్లీ కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. ఇళ్ల కేటాయింపుల్లో పారదర్శకత పాటించి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ, పాలకవర్గ సభ్యులు తమకు నచ్చిన వ్యక్తులకే ఇళ్లు కేటాయిస్తున్నారని నాయకులు ఆరోపించారు. ఈ విషయంపై ప్రశ్నించినప్పుడు ఓ కాంగ్రెస్ నాయకుడు దురుసుగా సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. అర్హులైన పేదలకు న్యాయం చేయాలని కోరుతూ మహాదేవపూర్ పంచాయతీ కార్యదర్శికి బుధవారం వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ బీబీనగర్ మండల అధ్యక్షుడు పచ్చిమట్ల వంశీగౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు దండెం వెంకటేష్, మాజీ వార్డు సభ్యుడు మునిగాల మధు, నాయకులు ఆకుల ప్రవీణ్, ఎంఆర్‌పీఎస్ మండల అధికార ప్రతినిధి దేవరకొండ రమేష్, మునిగాల శివ తదితరులు పాల్గొన్నారు.





నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు:

- అలరించిన మహిళా ఉద్యోగుల ఆటపాటలు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 14:

నిజామాబాద్ నగరంలోని కలెక్టరేట్ ప్రాంగణం బుధవారం బతుకమ్మ పాటలు, కోలాటాల చప్పుళ్లతో మారుమోగిపోయింది. తెలంగాణ నాన్-గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవోస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మ సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వివిధ ప్రభుత్వ శాఖల మహిళా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఈ సంబరాలకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మొదటగా సాంప్రదాయబద్ధంగా గౌరీ పూజను నిర్వహించి వేడుకలను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి కలెక్టర్ బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో తీరొక్క రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఉత్సాహంగా సాగిన కోలాటం, దాండియా

కార్యాలయ పనివేళలు ముగిసినప్పటికీ, ఉద్యోగినులు ఎవరూ ఇళ్లకు వెళ్లకుండా ఎంతో హుషారుగా ఉత్సవంలో పాల్గొన్నారు. మహిళలు, యువతులు సాంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ గేయాలను ఆలపిస్తూ, లయబద్ధంగా చప్పట్లు కొడుతూ వైభవంగా ఆడారు. దాండియా, కోలాట నృత్యాలతో కలెక్టరేట్ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఉత్తమంగా అలంకరించిన బతుకమ్మలను ఎంపిక చేసి, విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ వేడుకల్లో అదనపు కలెక్టర్ భుజంగరావు, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్కుమార్, కార్యదర్శి శేఖర్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, అలాగే ఆయా శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

చింతకుంట వృద్ధాశ్రమంలో సీపీ సాయి చైతన్య మానవీయత

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 14:

చింతకుంట గ్రామంలోని ఉచిత వృద్ధాశ్రమాన్ని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ (సీపీ) పి. సాయి చైతన్య సందర్శించారు. బుధవారం ఆశ్రమానికి వచ్చిన ఆయన, అక్కడ ఆశ్రయం పొందుతున్న 25 మంది వృద్ధుల యోగక్షేమాలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు.



అనంతరం వృద్ధులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. మధ్యాహ్నం వారితో కలిసి గడిపి, స్వయంగా వృద్ధులకు భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వృద్ధులు సమాజానికి విలువైన సంపద అని, వారి జీవిత పాఠాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వయసు పైబడిన తల్లిదండ్రుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమ, ఆదరణ చూపాలని పిలుపునిచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. జిల్లా పోలీస్ సిబ్బంది చింతకుంట మోహన్ ఎంతో శ్రద్ధతో, మానవతా దృక్పథంతో ఈ ఉచిత ఆశ్రమాన్ని నడిపించడం పోలీస్ శాఖకే గర్వకారణమని కొనియాడారు. ఆశ్రమానికి భవిష్యత్తులో ఎలాంటి సహాయం కావాలన్నా అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆశ్రమంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించి, ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ విజయ్ బాబు, రుద్రూర్ సీఐ కృష్ణ, బోధన్ ఎస్సైలు ఓ. వెంకట్ నారాయణ, వర్ని ఎస్ఐ వంశీ కృష్ణ, ఆశ్రమ వ్యవస్థాపకులు చింతకుంట మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో ఘనంగా ధర్మ చక్ర పరివర్తన దినోత్సవం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 14:

సమాజంలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాల స్థాపనకు గౌతమ బుద్ధుడి బోధనలే మార్గదర్శకాలని దళిత సంక్షేమ సంఘం (డీఎస్ఎస్) నాయకులు పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే విగ్రహం వద్ద డీఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం 70వ ధర్మ చక్ర పరివర్తన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధుడు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బుద్ధవందనం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 1956లో నాగ్‌పూర్‌లో లక్షలాది మంది అనుచరులతో బౌద్ధ ధర్మాన్ని స్వీకరించి మానవీయ విలువలకు పెద్దపీట వేశారని గుర్తుచేశారు. బుద్ధుడి బోధనలు మానవాళికి శాంతి, అహింస, సమానత్వ మార్గాన్ని చూపుతాయని, బౌద్ధ ధర్మం ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఎంతోమందికి స్ఫూర్తినిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఎస్ మండల అధ్యక్షుడు పాలెం రాజారాం, కాన్షీరాం మాల, అవినాష్ చమార్, జాంబవ చమార్, మామిడి రాజు, బి. సాగర్, అబేద్ తదితరులు పాల్గొన్నారు.



అస్పృశ్యత సంకెళ్లు తెంచి.. నవ్య చైతన్య తీరాలకు!

నాగ్‌పూర్‌లో చారిత్రక విప్లవం: ఒకే వేదికపై 8 లక్షల మందితో అంబేడ్కర్ అపూర్వ ధమ్మ దీక్ష

నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 14:

భారత సామాజిక విప్లవ చరిత్రలో సరిగ్గా 70 ఏళ్ల క్రితం (1956 అక్టోబర్ 14న) సరికొత్త అధ్యాయం లిఖించబడింది. శతాబ్దాలుగా సామాజిక అసమానతలు, అస్పృశ్యత కోరల్లో చిక్కుకుని ఆత్మగౌరవాన్ని కోల్పోయిన లక్షలాది మంది నిమ్నజాతులకు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సరికొత్త మార్గాన్ని చూపించారు. 'విజయదశమి' పర్వదినాన మహారాష్ట్రలోని నాగ్‌పూర్ (దీక్షాభూమి) వేదికగా సాగిన ఈ చారిత్రక బౌద్ధ ధమ్మదీక్షా మహోత్సవం ప్రపంచ చరిత్రలోనే ఒక అపూర్వ ఘట్టంగా నిలిచిపోయింది.

'హిందువుగా మరణించను' అని చాటి..

హిందూ సమాజంలో మార్పు కోసం సుదీర్ఘకాలం వేచి చూసిన అంబేడ్కర్ అక్కడి సనాతన ధోరణులతో విసిగిపోయారు. "ప్రతీ హిందువు రాజకీయంగా పెద్ద రాడికల్‌గా కనిపిస్తూ, సాంఘికపరంగా శుద్ధ సనాతనుడిలా వ్యవహరిస్తాడు'' అని ఆయన బలంగా విశ్లేషించారు. ఆత్మగౌరవం లేని చోట బానిస బతుకులు గడపడం కన్నా, సమానత్వాన్ని ప్రసాదించే మార్గాన్ని ఎంచుకోవడమే శ్రేయస్కరమని భావించి, 1935లోనే యోలా మహాసభలో తాను హిందూ మతాన్ని వీడుతున్నట్లు ప్రకటించారు.

ప్రపంచంలోని విభిన్న మతాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన అనంతరం, హేతువాదానికి ప్రతీకగా, విజ్ఞానశాస్త్ర సమ్మతంగా ఉన్న బౌద్ధం వైపు ఆయన ఆకర్షితులయ్యారు. బుద్ధుడిని తన గురువుగా స్వీకరించి, ఆధునిక ప్రపంచాన్ని రక్షించగల శక్తి ఒక్క బౌద్ధానికే ఉందని చాటిచెప్పారు.

నాడూ నాగ్‌పూర్‌లో జనప్రవాహం..

సామ్రాట్ అశోకుడు బౌద్ధాన్ని స్వీకరించిన పవిత్ర దినాన్ని పురస్కరించుకుని అంబేడ్కర్ గారు ఈ ముహూర్తాన్ని నిర్ణయించారు. దీక్షాభూమికి లక్షలాది మంది ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. మొదట అంబేడ్కర్ వారి సతీమణి సవితా అంబేడ్కర్ గారు బౌద్ధ భిక్షువు చంద్రమణి సమక్షంలో త్రిశరణాలు, పంచశీల సూత్రాలను స్వీకరించి లంఛనంగా బౌద్ధంలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ గారు మాట్లాడుతూ.. తనకు 'పూర్వజన్మ' లభించినట్లుగా ఉద్వేగానికి లోనయ్యారు.అనంతరం ఆయన పిలుపుతో అక్కడ సమకూడిన ఐదు లక్షల మందికి పైగా జనసందోహం ఏకకాలంలో లేచి నిలబడింది. ప్రపంచ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకే చోట, ఒకే సమయంలో 5 లక్షల మందితో అంబేడ్కర్ గారు త్రిశరణాలు, పంచశీల సూత్రాలతో పాటు తానే స్వయంగా రూపొందించిన 22 ప్రతిజ్ఞలను చేయించారు. మరుసటి రోజు (అక్టోబర్ 15న) తరలివచ్చిన మరో 3 లక్షల మందికి కూడా ఆయనే స్వయంగా ధమ్మదీక్షను ఇచ్చారు.

అసంపూర్తిగా మిగిలిన మహాత్కార్యం

బౌద్ధాన్ని కేవలం మతంగానే కాకుండా ఒక గొప్ప సాంస్కృతిక శక్తిగా మార్చాలని అంబేడ్కర్ తలంచారు. అందుకోసమే బెంగళూరులో నలంద, తక్షశిలల తరహాలో ఒక బౌద్ధ విశ్వవిద్యాలయాన్ని స్థాపించేందుకు ఏర్పాట్లు చేశారు. పాళీ భాషలోని బౌద్ధ సాహిత్యాన్ని ఇంగ్లీష్, ప్రాంతీయ భాషల్లోకి అనువదించడానికి ఒక ముద్రణాలయాన్ని సిద్ధం చేశారు. సామాన్యులకు సైతం బౌద్ధం సులువుగా అర్థమయ్యేలా "ది బుద్ధ అండ్ హిజ్ ధమ్మ" అనే అద్భుత గ్రంథాన్ని రచించారు.

దేశవ్యాప్తంగా ఇలాంటి మరిన్ని దీక్షలు నిర్వహించి, భారతదేశంలో బౌద్ధానికి పూర్వవైభవాన్ని తీసుకురావాలని ఆయన భావించారు. ఒకవేళ ఆ ప్రణాళికలు సఫలమై ఉంటే, దేశ జనాభాలో మూడో వంతు మంది బౌద్ధాన్ని స్వీకరించి ఉండేవారని చరిత్రకారులు అంచనా వేస్తున్నారు. అయితే, ఈ చారిత్రక ఘట్టం జరిగిన కొద్ది రోజులకే.. 1956 డిసెంబర్ 6న ఆయన హఠాత్తుగా మహా పరినిర్వాణం చెందడంతో ఆ మహత్కార్యం అసంపూర్తిగానే మిగిలిపోయింది. అయినప్పటికీ, నాగ్‌పూర్ వేదికగా ఆయన వెలిగించిన చైతన్య జ్యోతి నేటికీ కోట్లాది మంది జీవితాల్లో ఆత్మగౌరవ వెలుగులను నింపుతూనే ఉంది.



ధర్మోరా జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు వరుసగా రెండోసారి ప్రతిష్ఠాత్మక 'ఫైవ్ స్టార్' రేటింగ్!

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి)
అక్టోబరు 14:

మోర్తాడ్ మండలంలోని స్థానిక ధర్మోరా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జెడ్పీహెచ్ఎస్ విద్యా రంగంలో మరోసారి తన అసాధారణ ప్రతిభను చాటుకుంది. పాఠశాలల నాణ్యతా ప్రమాణాలను అంచనా వేసే ఎస్‌హెచ్‌వీఆర్ లో ఈ పాఠశాల ఏకంగా 93.6 పాయింట్లు సాధించి, వరుసగా రెండోసారి ఫైవ్ స్టార్ రేటింగ్‌ను కైవసం చేసుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు నిదర్శనంగా నిలుస్తూ ఈ ఘనత సాధించడం విశేషం.

ఈ అద్భుత విజయంతో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాల జాతీయ/రాష్ట్ర స్థాయి ప్రమాణాలతో పోటీ పడుతూ ఇలాంటి అత్యున్నత రేటింగ్‌ను నిలబెట్టుకోవడం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.



నమష్టి కృషికి దక్కిన ఫలితం: ప్రధానోపాధ్యాయులు

పాఠశాలకు రెండోసారి 5 స్టార్ రేటింగ్ రావడం తమకు దక్కిన గర్వకారణమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎర్రోజు రఘునందన చారి గారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఈ ఘనత సాధించడంలో ఉపాధ్యాయుల నిరంతర శ్రమ, విద్యార్థుల పట్టుదల, మరియు పాఠశాల బృందం సమష్టి కృషి కీలక పాత్ర పోషించాయి. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తూ, విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్తును అందిస్తాం" అని స్పష్టం చేశారు.

ఈ అరుదైన మైలురాయిని అధిగమించిన ధర్మోరా జెడ్పీహెచ్ఎస్ బృందాన్ని, విద్యార్థులను విద్యాశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.



నేడు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

బీబీనగర్, అక్టోబర్ 14 (ప్రజాకలం): మండల కేంద్రంలో గురువారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక ఫేమస్ ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

- బీబీనగర్ ప్రజలకు సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి

బీబీనగర్, అక్టోబర్ 14 (ప్రజాకలం): వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో రానున్న రోజుల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని, ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈ మేరకు గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నల్లాలకు కుళాయిలు బిగించుకోవాలని, అవసరమైనంత నీటినే వినియోగించాలని సూచించారు. నీటిని వృథాగా పారబోయకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. నీటి సంరక్షణలో ప్రజలందరూ భాగస్వాములై, గ్రామంలో నీటి వృథాను అరికట్టేందుకు సహకరించాలని కోరారు. నీటిని కాపాడుకోవడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించవచ్చని పేర్కొన్నారు.



ఘనంగా కట్ట మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట



భూదాన్ పోచంపల్లి,
అక్టోబర్ 14 (ప్రజా కలం)

పట్టణంలోని పెద్ద చెరువు వద్దగల శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ తల్లి దేవాలయ పునర్నిర్మాణం, నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం భాగంగా బుధవారం భక్తిశ్రద్ధలతో, వేద మంత్రాల నడుమ వైభవంగా ప్రారంభమైంది. విగ్రహ దాతలు మెరుగు గోపాల్ యాదవ్ ధర్మపత్ని చైతన్య చే విగ్రహ ప్రతిష్ఠ చేసారు. బలిప్ర దానం, బలిహరణము, పూర్ణాహుతి, మంగళ హారతి, మంత్ర పుష్పము నిర్వహించారు. అనంతరం మెరుగు మల్లయ్య యాదవ్, ధర్మపత్ని అంతమ్మ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమము చేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముప్పిడి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు ఇబ్రహీంపట్నం అంజయ్య, గుణంగారి దినేష్ రెడ్డి, పోతగల్లు దానయ్య, కొమ్ము లక్ష్మణ్, గౌరవ సలహాదారులు బొక్క బాల్ రెడ్డి, కోయ్యడ నరసింహ, గునిగంటి మల్లేష్, చేరాల నరసింహ, ఉపాధ్యక్షులు మెరుగు బాలకృష్ణ యాదవ్, కేసారం బాల్ రెడ్డి, నల్ల నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శి దోడ్డమోని దినేష్ యాదవ్, సహాయ కార్యదర్శులు సంకు నరసింహ, గోర్కంటి బాలయ్య, దొడ్డమోని ప్రభాకర్, కోశాధికారి మోటే మహేష్, వంగూరి సైదులు, కొమ్ము చంద్రయ్య, సాంస్కృతిక కార్యదర్శి సొల్లు శంకరయ్య, సహాయ సాంస్కృతిక కార్యదర్శి సైదులు సత్యనారాయణ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా కట్ట మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట



భూదాన్ పోచంపల్లి,
అక్టోబర్ 14 (ప్రజా కలం)

పట్టణంలోని పెద్ద చెరువు వద్దగల శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ తల్లి దేవాలయ పునర్నిర్మాణం, నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం భాగంగా బుధవారం భక్తిశ్రద్ధలతో, వేదమంత్రాల నడుమ వైభవంగా ప్రారంభమైంది. విగ్రహ దాతలు మెరుగు గోపాల్ యాదవ్ ధర్మపత్ని చైతన్య చే విగ్రహ ప్రతిష్ఠ చేసారు. బలిప్రదానం, బలిహరణము, పూర్ణాహుతి, మంగళ హారతి, మంత్ర పుష్పము నిర్వహించారు. అనంతరం మెరుగు మల్లయ్య యాదవ్, ధర్మపత్ని అంతమ్మ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమము చేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముప్పిడి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు ఇబ్రహీంపట్నం అంజయ్య, గుణంగారి దినేష్ రెడ్డి, పోతగల్లు దానయ్య, కొమ్ము లక్ష్మణ్, గౌరవ సలహాదారులు బొక్క బాల్ రెడ్డి, కోయ్యడ నరసింహ, గునిగంటి మల్లేష్, చేరాల నరసింహ, ఉపాధ్యక్షులు మెరుగు బాలకృష్ణ యాదవ్, కేసారం బాల్ రెడ్డి, నల్ల నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శి దోడ్డమోని దినేష్ యాదవ్, సహాయ కార్యదర్శులు సంకు నరసింహ, గోర్కంటి బాలయ్య, దొడ్డమోని ప్రభాకర్, కోశాధికారి మోటే మహేష్, వంగూరి సైదులు, కొమ్ము చంద్రయ్య, సాంస్కృతిక కార్యదర్శి సొల్లు శంకరయ్య, సహాయ సాంస్కృతిక కార్యదర్శి సైదులు సత్యనారాయణ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాచుపల్లి భూ వివాద కలకలం

- కోర్టు స్టే ఉత్తర్వులు అమలులో ఉన్న ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేసిన కందుకూరు ఎమ్మార్వో గోపాల్

- కందుకూరు ఎమ్మార్వో కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత - రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం

- బాచుపల్లి జిపివో పై పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

కందుకూరు, అక్టోబర్ 14 (ప్రజా కలం):


రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు ఎమ్మార్వో కార్యాలయం వద్ద మంగళవారం ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అక్రమ రిజిస్ట్రేషన్లను నిరసిస్తూ పెద్ద సంఖ్యలో బాచుపల్లి గ్రామానికి చెందిన రైతులు ఆందోళనకు దిగారు.

అసలేం జరిగింది?

బాచుపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 1, 2 లోని భూముల విషయంలో ప్రస్తుతం కోర్టులో వివాదం నడుస్తోంది. కోర్టు స్టే ఉత్తర్వులు అమలులో ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా కందుకూరు ఎమ్మార్వో గోపాల్ ఆ భూములను ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేశారని బాధిత రైతులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు.

60 మంది రైతులకు అన్యాయం

ఈ అక్రమ రిజిస్ట్రేషన్ల వల్ల సుమారు 60 మంది పేద, సామాన్య రైతులకు చెందిన భూములు అధికారిక రికార్డుల్లో గల్లంతయ్యాయని, తమకు తీవ్ర అన్యాయం




జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో సంబంధిత జీపీవో పాత్రపై కూడా సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా

తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో రైతులు కందుకూరు ఎమ్మార్వో కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. చేతుల్లో ప్లకార్డులతో అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ భూములను తిరిగి తమ పేరిట నమోదు చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి వెంటనే విచారణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కందుకూరు ఎమ్మార్వో గోపాల్

బాచుపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 1, 2 లోని భూముల విషయంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని పై అధికారుల ఆదేశాల మేరకు వారు పంపించిన రికార్డులను అమలు చేయడం జరిగిందని దీనిపై రైతుల అభిప్రాయాలను రికార్డు చేసి పై అధికారులకు పంపించి వారి నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అప్పటివరకు ఈ భూ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోమని ఎమ్మార్వో అన్నారు.





అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడాలి

ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా మల్కాజిగిరిలో కాంగ్రెస్ భారీ ర్యాలీ

ఓటు హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తాం



మల్కాజిగిరి, అక్టోబరు 14 (ప్రజా కలం ప్రతినిధి):

ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మల్కాజిగిరి చౌరస్తా నుంచి ఆనంద్‌బాగ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ముఖ్య అతిథిగా పాల్గొని నిరసనకు మద్దతు తెలిపారు.

ఈ నందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అర్హులైన ఓటర్ల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొలగింపునకు గురైన అర్హులైన ఓటర్ల హక్కులను పునరుద్ధరించాలని, వారి నుంచి ఎలాంటి పనులు చేపట్టడం లేదా వసూళ్లు చేయడం జరగకూడదని కోరారు.

రాహుల్ గాంధీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాలు చేపడుతోందని నాయకులు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు దక్కే వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో పారదర్శకత ఉండాలని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగింపునకు గురికాకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ర్యాలీ అనంతరం ఆనంద్‌బాగ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకులు నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం సమర్పించారు. ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఉద్యమాన్ని మరింత విస్తరిస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి లక్ష్మీకాంత్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, జితేంద్రనాథ్, ఏకే మురుగేష్, బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, గుండా నిరంజన్, జీఎన్‌వీ సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, రామచందర్ బాబు, సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు జీడీ సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, సత్యమూర్తి, వైనాల ప్రవీణ్, పిట్టల నాగరాజు, యూసుఫ్ భాయ్, రాఘవన్, లక్ష్మీ, ఎస్ఆర్ ప్రసాద్, రామచందర్, ఫరీద్, సయ్యద్ మబ్బు, ఆశా, సుమలత యాదవ్, కనకలక్ష్మి, శారద, పుష్పలత, బ్రహ్మయ్య, పీవీ సత్యనారాయణ, ఉపేందర్ రెడ్డి, రామకృష్ణ, వెంకన్న, సిరిగిరి రాజు, కన్నా, సందీప్ గౌడ్, ఇస్తారి, చుంకు శ్రీనివాస్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అధికారుల ఉక్కు పాదం

- జాతీయ రహదారిపై రోడ్డుకి ఇరువైపులా అక్రమంగా ఉన్న షాపుల తొలగింపు

-ఎవరు ఆక్రమించినా కఠిన చర్యలు - శంషాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు







మహేశ్వరం, అక్టోబర్ 14 (ప్రజా కలం):

తుక్కుగూడ జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ పరిధిలోని తుక్కుగూడ వార్డులో అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అధికారులు కొరడా ఝళిపించారు. శ్రీశైలం హైవే రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి అక్రమంగా వేసిన షెడ్లు, షావులపై అధికారులు ఉక్కుపాదం మోపారు. శంషాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు, టీపీవో సంతోష్ సింగ్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నుంచి భారీ ఎత్తున రోడ్డు విస్తరణ, కూల్చివేత చర్యలు చేపట్టారు.

నాలుగు జేసీబీలు మూడు బృందాలు గా ఏర్పడి కూల్చివేత

రోడ్డుకు 50 ఫీట్ల లోపల అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించేందుకు అధికారులు నాలుగు జేసీబీలను రంగంలోకి దింపారు. పోలీసు బలగాలతో కలిసి ఉదయం నుంచే కూల్చివేతలు ప్రారంభించారు. ఒక్కసారిగా జేసీబీలు రంగంలోకి దిగడంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

వ్యాపారస్తుల ఆందోళన - అధికారుల హెచ్చరిక

తమకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చేస్తారంటూ స్థానిక వ్యాపారస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూల్చివేతలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, ప్రభుత్వ రోడ్డును ఎలాంటి పర్మిషన్ లేకుండా ఆక్రమించి షెడ్లు వేసినప్పుడు నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఇది పూర్తిగా ఆక్రమణ కిందకే వస్తుందని స్పష్టం చేశారు. ఎవరు ఆక్రమించినా కఠిన చర్యలు తీసుకుంటామని, ఇకపై ఉపేక్షించేది లేదని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు, టీపీవో సంతోష్ సింగ్ హెచ్చరించారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్

శ్రీశైలం హైవేపై నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం వల్ల పాదచారులు నడవడానికి స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే జీహెచ్ఎంసీ ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, పహాడీ షరీఫ్ పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గజ్వేల్‌కు మళ్లీ వస్తా

- ఒకరోజంతా మీతోనే ఉంటా - బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ భరోసా

- రిమ్మనగూడ వద్ద కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికిన వంటేరు ప్రతాప్ రెడ్డి

- భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



గజ్వేల్, అక్టోబర్ 14 (ప్రజా కలం ప్రతినిధి):

"మళ్లీ ఒకసారి గజ్వేల్‌కు వస్తా. ఒకరోజంతా మీతోనే ఉంటా''అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కేటీఆర్ పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలతో గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది.గోదావరిఖనిలో నిర్వహించనున్న సిం గరేణి కార్మిక గర్జన బహిరంగ సభకు వెళ్తున్న కేటీఆర్.. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజ కవర్గంలోని రిమ్మనగూడ ఎస్-4 వద్ద బీఆర్ ఎస్ శ్రేణులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు.రిమ్మనగూడకు చేరుకున్న కేటీఆర్‌కు వంటేరు ప్రతాప్ రెడ్డితో పాటు బీఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కేటీఆర్ పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తూ,నాయకులు, కార్యకర్తలతో కొద్దిసేపు ఆప్యాయంగా ముచ్చటించారు. గజ్వేల్ నియోజకవర్గ నాయకులు,కార్యకర్తలతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ మరోసారి గజ్వేల్‌కు వచ్చి రోజంతా వారితోనే గడుపుతానని హామీ ఇచ్చారు.కేటీఆర్ ఇచ్చిన భరోసాతో బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపించింది. అనంతరం కేటీఆర్ భారీ కాన్వాయ్‌తో గోదావరిఖనిలో జరగనున్న సింగరేణి కార్మిక గర్జన బహిరంగ సభకు బయలుదేరి వెళ్లారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెట్రోల్ బాటిల్‌తో తహసీల్దార్ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నం

- కందుకూరు తహసీల్దార్ కార్యాలయంలో ఉద్రిక్తత

-కోర్టు స్టే ఉన్న భూముల రిజిస్ట్రేషన్‌పై రైతుల ఆగ్రహం

- కందుకూరు ఎమ్మార్వో గోపాల్ పై అవినీతి ఆరోపణలు చేసిన రైతులు

- 60 మంది రైతులకు అన్యాయం జరిగిందని ఆవేదన



కందుకూరు, అక్టోబర్ 14 (ప్రజా కలం):

భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారంలో తమకు అన్యాయం జరిగిందంటూ ఓ మహిళా రైతు కందుకూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. బాచుపల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 1, 2లో కోర్టు స్టే ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా భూములను ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేశారని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో సుమారు 60 మంది పేద రైతులు తమ భూములను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. తమ భూముల విషయంలో న్యాయం జరగకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ మహిళా రైతు పెట్రోల్ బాటిల్‌తో తహసీల్దార్ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. అప్రమత్తమైన పోలీసులు వెంటనే ఆమె వద్ద నుంచి పెట్రోల్ బాటిల్‌ను స్వాధీనం చేసుకోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఈ ఘటనతో కార్యాలయ పరిసరాల్లో ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కోర్టు స్టే ఉన్నప్పటికీ భూముల రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయంటూ బాధిత రైతులు ప్రశ్నిస్తున్నారు. తమ భూముల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, కోర్టు ఆదేశాల ఉల్లంఘనపై విచారణ జరిపి బాధిత రైతులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

శ్రీ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్

ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు

పటాన్ చేరు అక్టోబర్ 14 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పటాన్‌చెరు పట్టణంలోని శ్రీ మహంకాళి దేవాలయంలో బుధవారం నిర్వహించిన



ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, ప్రజల జీవితాల్లో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు ప్రజల మధ్య ఐక్యతను చాటిచెబుతాయని పేర్కొన్నారు ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ సపాన దేవ్, పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ప్రకాష్ రావు, చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్రా రెడ్డి, మాణిక్ ప్రభు, మల్లేష్, వినోద్ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లాలో రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు

- అక్టోబర్ 15, 16 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహణ

- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ కే. హైమావతి

సిద్దిపేట, అక్టోబర్ 14 (ప్రజా కలం ప్రతినిధి):

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ 15, 16 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కే. హైమావతి తెలిపారు. జిల్లాలోని హుస్నాబాద్,సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న



అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణలో భాగంగా గైర్హాజరు, వలస వెళ్లిన,మరణించిన,డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించి ఏఎస్‌డీడీ జాబితాలో చేర్చబడిన వారి వివరాలను పరిశీలించుకోవడంతో పాటు, తొలిసారిగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే 18 సంవత్సరాలు నిండిన యువతకు,అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఓటరుగా నమోదు కాని వారికి ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ రెండు రోజుల పాటు నిర్వహించే శిబిరాల్లో ఫారం–6 సమర్పించిన అర్హులైన వారి వివరాలను నవంబర్ 9న ప్రచురించనున్న తుది ఓటరు జాబితాలో చేర్చేందుకు అవకాశం ఉంటుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరాల నిర్వహణ సందర్భంగా సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి ఓటరు నమోదు ప్రక్రియలో ప్రజలకు సహకరిస్తారని తెలిపారు. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) సైతం ఈ శిబిరాల్లో పాల్గొనాలని కోరారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా,అనర్హుల పేర్లు జాబితాలో లేకుండా చూడాలనే లక్ష్యంతో ఈ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ప్రజలు తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని,అర్హత ఉన్నవారు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి కే. హైమావతి విజ్ఞప్తి చేశారు.

స్కూటీలు దొంగతనం చేస్తున్న ఐదుగురు నిందితుల అరెస్ట్

గుంటూరు : నగర పరిధిలో వరుసగా ద్విచక్ర వాహనాలు దొంగిలించబడుతున్నాయనిపోలీసులకు సమాచారం అందింది. దీనిపై నిఘా పెట్టిన లాలాపేట పోలీసులు ఐదుగురు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు.ప్రధాన నిందితుడు షేక్ కరీముల్లా. అతనితో పాటు షేక్ మాదర్ వలీ, షేక్ జాఫర్ సాదిక్, షేక్ మస్తాన్ వలి, మరో మైనర్ నిందితుడిని పట్టుకున్నారు. వీరంతా నల్లచెరువు, సంపత్ నగర్ నివాసులు. బృందంగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. నల్లపాడు, పాత గుంటూరు, పట్టాభిపురం, సత్తెనపల్లి పరిధుల్లో దొంగతనాలు చేశారు. వీరి దగ్గర నుంచి 21 సుజుకి స్కూటర్లను రికవరీ చేశారు. వీటి మార్కెట్ విలువ సుమారు 20 లక్షలు.దొంగిలించిన వాహనాలను తురకపాలెంలోని మధ్యవర్తి ద్వారా కంటైనర్లలో చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు తరలిస్తున్నారని పోలీసులు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 42 మందికి జైలు శిక్ష

- మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

- గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ

గజ్వేల్, అక్టోబర్ 14 (ప్రజా కలం ప్రతినిధి):

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై గజ్వేల్ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు.డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 42 మందికి గజ్వేల్ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జైలు శిక్షలు విధించింది. రోడ్డు ప్రమాదాల నివారణ,ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ,మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాహనదారుల ప్రాణాలతో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు.మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడతాయని హెచ్చరించారు.డ్రంక్ అండ్ డ్రైవ్‌పై నిరంతరం తనిఖీలు కొనసాగిస్తామని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ స్పష్టం చేశారు.మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు, న్యాయస్థానం ద్వారా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.వాహనదారులు మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని విజ్ఞప్తి చేశారు.



రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

- ఎకరానికి రూ.30 వేల నష్టపరిహారం చెల్లించాలి

: బీఆర్ఎస్ నేత కళ్యాణ్ కార్ నర్సింగరావు

-విద్యుత్ సమస్యతో ఎండుతున్న వరి పొలాలు..

ట్యాంకర్లు,జనరేటర్లతో పంటలను కాపాడుకుంటున్నరైతులు



గజ్వేల్, అక్టోబర్ 14 (ప్రజా కలం ప్రతినిధి):

విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా వరి పంటలు ఎండిపోతున్నాయని, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించి 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కళ్యాణ్ కార్ నర్సింగరావు డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యతో నష్టపోతున్న రైతులకు ఎకరానికి రూ.30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ పరిధిలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో సాగునీరు అందక వరి పొలాలు ఎండిపోతున్నాయి.ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కళ్యాణ్ కార్ నర్సింగరావు రైతులతో కలిసి వంట పొలాలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి సాగు చేసిన వరి పంటకు సరిపడా నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా మోటార్లు సక్రమంగా పనిచేయకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు.తప్పనిసరి పరిస్థితుల్లో వాటర్ ట్యాంకర్లు, జనరేటర్ల సహాయంతో పొలాలకు నీటిని అందిస్తూ పంటలను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు.ఇప్పటికే సాగు కోసం పెట్టుబడులు పెట్టిన రైతులకు విద్యుత్ సమస్య అదనపు భారంగా మారిందని అన్నారు.ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం,జనరేటర్లను వినియోగించడం వల్ల అదనపు ఖర్చులు పెరిగి రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి వ్యవసాయానికి నిరంతరాయంగా 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతోపాటు, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సరఫరాలో అంతరాయాలను తొలగించాలని, పంటలు పూర్తిగా దెబ్బతినకముందే తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రవాడ బాలకృష్ణ,డీజే షాదుల్‌తో పాటు రైతులు ఎర్రవాడ వెంకటేష్, యాదగిరి,స్వామి,నర్సింలు గౌడ్,భిక్షపతి,సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధల మధ్య శరన్నవరాత్రి ఉత్సవాలు

- దుర్గామాత మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ యూత్ ప్రోటోకాల్ చైర్మన్ ఆదిత్యరెడ్డి

- జేపీ కాలనీ డివిజన్ పరిధిలో ఘనంగా దసరా శరన్నవరాత్రి వేడుకలు

- పలు కాలనీలు, బస్తీల్లో దుర్గామాత మండపాలను సందర్శించిన ఆదిత్యరెడ్డి

- అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ యూత్ ప్రోటోకాల్ చైర్మన్

- ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థన

- ఉత్సవ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపిన ఆదిత్యరెడ్డి





పటాన్ చేరు అక్టోబర్ 14 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు జేపీ కాలనీ డివిజన్ పరిధిలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా వివిధ కాలనీలు, బస్తీలలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో తెలంగాణ యూత్ ప్రోటోకాల్ చైర్మన్ ఆదిత్యరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గామాత కరుణాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ప్రార్థించారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉత్సవాల్లో భాగంగా గోకుల్ నగర్ కాలనీలో గోకుల్ యూత్ ఆధ్వర్యంలో, నర్రా బస్తీలో రాము పర్యవేక్షణలో, సాయిరామ్ కాలనీలో ధనేష్ నేతృత్వంలో, గోనెమ్మ బస్తీలో మనోజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను ఆదిత్యరెడ్డి సందర్శించారు అలాగే జేపీ కాలనీలో సన్నీ, లడ్డూ ఆధ్వర్యంలో, శ్రీరామ్ నగర్, శాంతి నగర్ కాలనీలలో పవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శాంతి నగర్ కాలనీలో శ్రీధర్ చౌదరి, మనీష్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లోనూ భాగస్వాములయ్యారు

అదేవిధంగా బండ్లగూడలో మధు ఆధ్వర్యంలో, వెంకటేశ్వర కాలనీలో సాయి నేతృత్వంలో, శ్రీనగర్ కాలనీలో అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో, శాంతి నగర్‌లో సాయి, శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గామాత నవరాత్రి వేడుకలకు హాజరయ్యారు. ఆయా మండపాల్లో అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించి, ఉత్సవ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని, అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆదిత్యరెడ్డి ఆకాంక్షించారు.

మూడు దశాబ్దాలుగా వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న మాద్రి పృథ్వీరాజ్

పటాన్ చేరు అక్టోబర్ 14 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరువు: మహంకాళి దేవాలయ సేవా సమితి ఆధ్వర్యంలో గత 30 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు పటాన్‌చెరువు పట్టణంలోని మైత్రి గ్రౌండ్‌లో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మాజీ కార్పొరేటర్



సఫాన్ దేవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తి, సంప్రదాయాలకు ప్రతీకగా నవరాత్రి వేడుకలు

మూడు దశాబ్దాలుగా సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు భక్తులలో ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను,సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. భక్తి భావంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలు కొనసాగుతున్నాయి.

ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు కలగాలి

ఈ సందర్భంగా మాద్రి పృథ్వీరాజ్ అమ్మవారిని దర్శించుకుని, మహంకాళి దేవాలయ సేవా సమితి సభ్యులకు దేవీ నవరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు గత 30 సంవత్సరాలుగా భక్తి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ దేవీ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్న మహంకాళి దేవాలయ సేవా సమితి సేవలు అభినందనీయం. భక్తుల భాగస్వామ్యంతో ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయి.

భూభారతిలో భాగంగా అప్పాజీపల్లిలో గ్రామసభ

భూముల రీ సర్వేతో రైతులకు ప్రయోజనం

భూ వివాదాలకు పరిష్కారం లభించే అవకాశం

సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్

మెదక్, అక్టోబర్ 14 (ప్రజాకలం ప్రతినిధి) ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి కార్యక్రమంలో భాగంగా భూముల రీ సర్వేపై ప్రజలకు



అవగాహన కల్పించేందుకు మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని అప్పాజీపల్లి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూముల రీ సర్వే ప్రక్రియ, రైతులకు కలిగే ప్రయోజనాలు, రెవెన్యూ శాఖ చేపట్టనున్న చర్యలను అధికారులు గ్రామస్థులకు వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ మాట్లాడుతూ.. భూముల రీ సర్వే ద్వారా సర్వే నంబర్ల వారీగా పొలాల హద్దులపై స్పష్టత వస్తుందని తెలిపారు. దీంతో భూ వివాదాలు తగ్గడంతో పాటు భవిష్యత్తులో రైతులకు ఎదురయ్యే ఇబ్బందులను నివారించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. భూములకు సంబంధించిన వివరాల్లో స్పష్టత రావడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ చారి, డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్, మండల సర్వేయర్ మొగులయ్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, రెవెన్యూ శాఖ అధికారులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రంగంపేటలో ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతం

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు ప్రత్యేక పూజలు

మెదక్ అక్టోబర్ 14 (ప్రజాకలం ప్రతినిధి) మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేట గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సామూహిక సత్యనారాయణ వ్రతంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తితో పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తుల పూజలు, ప్రార్థనలతో కార్యక్రమం భక్తిమయంగా సాగింది. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, చిన్నారుల నృత్య ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో గ్రామస్తులు, మహిళలు, భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులవుతున్నారు.

